హైదరాబాద్ వార్త



# మీటర్ గిరగిర..

**-గ్రేటర్‌లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్**
**-గృహాలు, ఆఫీసుల్లో మొదలైన ఫ్యాన్లు, ఎసిల వాడకం**
**-ఇప్పటికే 67ఎంయులు చేరిన వినియోగం**
**-ఏప్రిల్-మే నాటికి 100 ఎంయులకు చేరే ఆవకాశం**

**హైదరాబాద్,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** గ్రేటర్ జోన్ పరిధిలో గత వారం విద్యుత్ వినియోగం 65 నుంచి 70 మిలియన్ యూనిట్లుగా నమోదువుతుంది. గత సంవత్సరం ఫిబ్రవరిలో నమోదైన దానికంటే ఈసారి అధికంగా వినియోగం జరుగుతంది. ఉష్ణోగ్రత్తలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం మరింత పెరుగుతందని తెలంగాణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్ ఎస్‌పీడీసీఎల్) అధికారులు తెలుపుతున్నారు. వినియోగం రికార్డు స్థాయిలో నమోదవుతున్న నేపథ్యంలో సబ్ స్టేషన్‌ల పనితీరు, డిమాండ్, సప్లైలపై ప్రతి రోజూ ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే మేచివరి వరకు వాతావారణం ఉష్ణోగ్రతలు ఇలానే ఉండవచ్చునని వాతవరణ అధికారులు తెలుపుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం ఇంకా పెరిగే అవకాశం ఉందని ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడకుండా పలు ప్రాంతాల్లో మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ అధికారులు తెలుపుతున్నారు. గతంతో పోలిస్తే ఈసారి మార్చ్, ఏప్రిల్‌లోనే గరిష్ఠ వినియోగం నమోదయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్లను పూర్తిచేయాలని, ఈనెలాఖరులోగా పూర్తిగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొని రావాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ము షారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. గత రెండేళ్లలో విద్యుత్ వినియోగం 80 నుంచి 90 మిలియన్‌యూనిట్లు జరగగా.. ఈ సంవత్సరం 100 మిలియన్ యూనిట్లకు చేరుతుందని అధికారులు అంచనా వేశారు. గత నాలుగైదు రోజుల్లో విద్యుత్ డిమాండ్‌ను పరిశీలిస్తే ఈనెల 13న 67 ఎంయులు నమోదుకాగా 14న -64, 15న -62, 16న -67 వరకు నమోదైంది.



గృహాలు కార్యాలయాల్లో పెరిగిన విద్యుత్ వాడకం..

డిమాండ్ ఏస్థాయిలో పెరిగిన సబ్‌స్టేషన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఏజీకాలనీలోని స్కాడా భవనం నుంచి ఆపరేషన్ అధికారులు నిరంతరం సర్కిళ్ల వారీగా నమోదవుతున్న విద్యుత్ వినియోగంపై దృష్టి కేంద్రీకరించారు. హైదరాబాద్ సెంట్రల్ సౌత్, సైబర్ సిటీ, సికింద్రాబాద్, బంజారాహిల్స్, రంగారెడి ఈస్ట్, వెస్ట్,నార్త్ సర్కిళ్ల పరిధిలో విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతుంది. గ్రేటర్ జోన్‌లో సాధారణంగా 60-65 ఎంయూలు నమోదవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో గృహాలు ఆఫీసులు ,ప్రైవేట్ కంపెనీల్లో ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం ఒకటి నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్ డిమాండ్ ఎక్కువగా నమోదవుతోందని ఆపరేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ఉష్ణాగ్రత్తలు బట్టి వినియోగంలో మార్పు చోటుచేసుకుంటున్నాయని తెలుపుతున్నారు.

**ఏసీలు వాడకం పెరగడం..**

నగరం అసలే కాంక్రీట్ మయం..ఏటికేటికి నిర్మాణాలు పెరుగుతుండటంతో అభివృద్ధి పేరిట పచ్చధనం కనుమరుగవతుంది. ఈనేపథ్యంలో ఉష్ణోగ్రత్తల పెరుగుదల కన్పిస్తుది. చెట్ల సంఖ్య తగ్గడతో చల్లధనం కోసం కూలర్లు, ఏసీలు వాడితే తప్ప వేసవి వేడి నుంచి ఉపశమనం పొందే వాతావరణం లేదు. ఇవన్నీ కరెంట్ వాడకం పెరిగేందుకు కారణమే. వినియోగం దారులు పెరగడం, నగరం విస్తరించడం, ఏటా ఏసీలు వాడే వారి సంఖ్య వంటి కారణాలు విద్యుత్ డిమాండ్‌ను పెంచేస్తున్నాయి.

# మణికొండలో పగిలిపోయిన మంజీరా పైప్‌లైన్

**- పెద్ద ఎత్తున వృధా అయిన మంచినీరు**
**- సెల్లార్లను ముంచెత్తిన వరద నీరు**
**- సహాయక చర్యలు చేపట్టిన హైడ్రా, జలమండలి అధికారులు**



మణికొండలో మంచినీటి పైప్ పగిలిని ప్రాంతంలో మరమ్మత్తులు చేస్తున్న అధికారుల దృశ్యం

**నార్సింగి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** మణికొండ డివిజన్ పరిధిలో మంగళవారం తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో మంచినీటి పైప్ భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో ఎగిసిపడ్డ లక్షలాది లీటర్ల మంచినీరంతా రోడ్డుపై ఏరులై పారింది. పక్కనే ఉన్న అపార్టుమెంట్ల సెల్లార్లన్నింటిని ముంచెత్తింది. సమీపంలోనే పందెన్‌వాగు ఉండడం వలన నీరు అందులో పడి ఇబ్రహీంభాగ్ చెరువులోకి చేరింది. లేదంటే చుట్టు పక్కల ఉన్న ఇళ్లన్నీ జలద్బింధంలో ఉండేవి. గంటల తరబడి రోడ్డుపై పారిన మంచినీరంతా పందెన్‌వాగులోకి చేరి చుట్టు పక్కల ఇళ్లను ఇబ్బందుల నుంచి కాపాడిందని స్థానికులు పేర్కొంటున్నారు. సింగూరు ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ మహానగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు వేసిన మంజీరా పెద్ద పైప్‌లైన్ పేలడం వలన ఎంప్లాయిస్ కాలనీ, శివసాయి కాలనీల్లో వరద నీరు గంటల తరబడి ఏరులై పారడంతో రోడ్డంతా ధ్వంసం అయ్యింది. వాహనాల రాకపోకలకు పనికి రాకుండా పోయింది. స్థానికులు ప్రత్యామ్నా మార్గాలలో రాకపోకలు సాగిస్తున్నారు. సెల్లార్లలో నీరు చేరడంతో అక్కడ పార్క్ చేసిన వాహనాలన్నీ నీట మునిగిపోయాయి. రెండు అపార్టుమెంట్లలో కేవలం పది నిమిషాల వ్యవధిలోనే ఆరు ఫీట్ల మేర నీరు చేరి, అందులో 10.కార్లు, మరో 15.వరకు ద్విచక్రవాహనాలు నీట మునిగిపోయాయి. బాధిత ప్రజలు తమ ఇళ్లపైకి చేరుకొని మొబైల్స్‌లో వీడియోలు తీసి మమ్మల్నీ కాపాడాలంటూ సోషల్ మీడియాలో, సంబంధిత అధికారులకు షేర్ చేశారు. దీంతో హైడ్రా, జలమండలి అధికారులు వెంటనే స్పందించి నీటి సరఫరాను పూర్తిగా నిలివేసి, మరమ్మత్తు పనులు చేయడం ప్రారంభించారు. పైప్‌లైన్ పగిలిన ప్రాంతంలో రోడ్డంతా ఓ పెద్ద గొయ్యిగా మారింది. ఈ గొయ్యిని పూడ్చి వాహనదారులు రాకపోకలు సాగించేందుకు మరో రెండు రోజుల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. అధికారులు వేగంగా స్పందించారని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. మేము సమాచారం ఇచ్చిన కేవలం 15. నిమిషాల వ్యవధిలోనే అధికారులు మా ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు ముమ్మరం చేశారని స్థానిక ప్రజలు పేర్కొన్నారు. సింగూరు నుంచి మోటాలర్ల సహాయంతో అత్యంత ఫోర్సుతో మంజీరా నీరు నగరానికి సరఫరా అవుతుందని, పైప్‌లైన్ ఆ ప్రెషర్ వల్లనే ఒక్కసారిగా పేలిపోయిందని అధికారులు తెలిపారు. వీలైనంత త్వరగా మరమ్మత్తులు పూర్తి చేస్తామని వివరించారు.

# నిర్లక్ష్యం వద్దు.. ఫైర్ సేఫ్టీలో రాజీ పడొద్దు : కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17,.ప్రభాతవార్త:** అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి ఫైర్ సేఫ్టీ విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని హాస్టళ్ల నిర్వాహకులకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. వస్తున్నది వేసవి కాలం.. ఎక్కడ ఏమాత్రం పొరపాటు జరిగినా పెను ముప్పు సంభవిస్తుంది.. ఇటీవల నగరంలో జరిగిన అగ్ని ప్రమాదాలే ఇందుకు నిదర్శనమన్నారు. నగరంలో లెక్కకు మిక్కిలిగా ఉన్న హాస్టళ్లు చాలా వరకు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదని ఫిర్యాదుల నేపథ్యంలో అగ్ని ప్రమాదాలపై హైడ్రా మంగళవారం ఓ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించింది. హాస్టళ్ల నిర్వాహకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫైర్ సేఫ్టీ విషయంలో పలు సూచనలు, హెచ్చరికలు చేశారు.'హాస్టళ్ల నిర్వాహకులతో సమావేశానికి ముందు క్షేత్రస్థాయిలో ఎల్లారెడ్డిగూడ, సంజీవరెడ్డినగర్ ప్రాంతాల్లోని మూడు హాస్టళ్లను ర్యాండమ్‌గా చెక్ చేశారు. చిన్న గదుల్లో స్థాయికి మించి కిక్కిరిసిన బెడ్లు.. ఎక్కడా ఎలాంటి ఫైర్ సేఫ్టీ నిబంధనలు కనిపించలేదు. సెల్లార్లలో మెస్‌లు.. భద్రతకోసం వేసిన గ్రిల్స్.. వాటికి తాళాలు. ఎక్కడా ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కనిపించ లేదని నాలుగైదు అంతస్తులున్న హాస్టల్ భవనంలో పొరపాటున నిప్పు రగిలితే ఆ ప్రమాదాన్ని ఊహించలేమని.ఇలాంటి పరిస్థితులకు చెక్ పెడదాం అన్నారు. స్వయంగా చూసిన పరిస్థితులను వివరించి హాస్టల్ నిర్వాహకులను హెచ్చరించారు.

**జాగ్రత్తలు పాటిస్తాం..**

అగ్ని ప్రమాదాలపై హైడ్రా జాగ్రత్తలను తూచా తప్పకుండా పాటిస్తామని హాస్టళ్ల నిర్వాహకులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. చదువులు, ఉద్యోగ, ఉపాధికోసం వచ్చిన వారికి ఫుడ్, బెడ్ ఇచ్చి తాము జీవనోపాధి పొందుతున్నామని.. వారి భద్రతకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూముల, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణతో పాటు పర్యావరణ హితమైన నగర నిర్మాణంలో హైడ్రా కృషి అభినదనీమని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచడంలో ప్రభుత్వ కృషిలో తాము కూడా భాగస్వామ్యం అవుతామని తెలిపారు. హాస్టళ్లలో నివాసం ఉంటున్న వారి భద్రత ప్రాధాన బాధ్యతగా భావిస్తామన్నారు. ఈకార్యక్రమంలో హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, ఆర్ ఎఫ్‌వో జయప్రకాష్, డీఫ్‌వోలు యజ్ఞ నారాయణ, గౌతమ్, ఏడీఎఫ్‌వో మోహనరావుతో పాటు.. ఎస్ ఎఫ్‌వోలు, జంటనగరాలలోని హాస్టళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.



హాస్టల్‌లో గడువు ముగిసిన ఫైర్ పరికరాలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# శివరాత్రిరోజు గంజాయితో రీల్స్ ...సిపి సజ్జనార్ పోస్టుతో పోలీసుల యాక్షన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** మహాశివరాత్రి రోజున దేవుడికి గంజాయి చూపిస్తూ కొందరు రీల్స్ చేయడంపై హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని "ఎక్స్"లో పోస్టు పెట్టారు. ఈ వ్యవహారంపై వెంటనే స్పందించిన చార్మినార్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఫలక్‌నుమా జంగమెట్‌కు చెందిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఫలక్‌నుమా పోలీసులకు అప్పగించారు.

**ఏం జరిగిందంటే..**

శివరాత్రి రోజున శివుడికి దైవప్రసాదం పేరుతో కొందరు యువకులు మాదకద్రవ్యాలు ప్రదర్శించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోను సీపీ సజ్జనార్ "ఎక్స్"లో పోస్టు చేశారు. దేవుడికి మాదకద్రవ్యాలు చూపించడం అత్యంత హేయమైన చర్య అని, వికృతమైన ఉన్మాదమని అన్నారు.

"సాహసం చేశామని అనుకుంటున్నారా!? అస్సలు కాదు. ఇది కటకటాల వెనుకకు చేర్చే తీవ్రమైన నేరం! ఒక్కసారి ఎన్‌డిపిఎస్ చట్టం ప్రయోగిస్తే.. జీవితాంతం పశ్చాత్తాపపడాల్సి వస్తుంది. లైకుల కోసం లోకాన్నే మరిచి.. వ్యూస్ కోసం విలువలనే వదిలి.. రీల్స్ కోసం రోడ్డున పడి.. మత్తులో మునిగి.. జీవితాలను నాశనం చేసుకుంటారా? క్షణికానందం ఇచ్చే లైకులు, వ్యూస్ కోసం మీ బంగారు భవిష్యత్తును బలిపెట్టకండి. ఇటువంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించం. బాధ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. సోషల్ మీడియాను మీ సృజనాత్మకతకు వేదికగా మార్చుకోండి.. వ్యసనాలకు వాకిలిగా కాదు" అని పోస్టులో పేర్కొన్నారు. పోలీసులు స్పందించడంతో ఆ విషయాన్ని కూడా సీపీ పోస్టు చేశారు.



నిందితులను ప్రదర్శిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

# శరవేగంగా ఎంఎంటిఎస్ ఫేజ్ టూ పనులు

**తార్నాక,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** నగర ప్రజలు యాదగిరి గుట్టకు ఎప్పుడెప్పుడా అని అదిరి చూస్తున్న ఎంఎంటీఎస్ ట్రైన్ అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పనుల్లో వేగం పెంచుతుంది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎంఎంటీఎస్‌కు రూ. 600 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పడంతో ప్రజల్లో మరో సారి ఆశలు చిగురిస్తున్నాయి. శ్రీలక్ష్మి నరసింహ్మ స్వామి అఖండ జ్యోతి రతయాత్ర సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాన్ని చెప్పడం జరిగింది. హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ ఫేజ్ టూ పనులను వేగవంతంగా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పడంతో నగర ప్రజలకు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి (రాయగిరి) వరకు సుమారు 35 కిలో మీటర్ల లైన్ నిర్మాణానికి సంభందించి ప్రాజెక్టు అమలుకు తాజాగా ఆమోదం లభించినట్లు అధికారులు పేర్కోన్నారు. ప్రభుత్వం లేటెస్ట్ సదుపాయాలతో నగర ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎంఎంటీఎస్ సేవలను మరింత విస్తరించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న రైలు సేవలను విస్తరించడంతో పాటు కొత్త మార్గాలపై దృష్టి సారించారు.రైల్వే శాఖ నిర్ణయంతో హైదరాబార్ నుంచి రాయగిరి వరకు సేవలను విస్తరించే యోచనలో ఉన్న విషయం తెలిసిందే ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.430 కోట్ల వ్యయం కానున్నట్లు అంచనా. ఎంఎంటీఎస్ రైళ్ల వినియోగంతో నగర ప్రయాణికులకు ఉపశమనం కలగనుంది. సికింద్రాబాద్ నుంచి యాదాద్రి వరకు రైలు మార్గాన్ని మెరుగుపరచే చర్యలు చేపడుతున్నారు. రైల్వే సమయాన్ని అందుబాటులోకి తీసుకురావడం, ప్రయాణికులకు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు.ఇదిలా ఉండగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కొనసాగుతోంది. ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. పూర్తయిన తర్వాత రోజుకు వేలాది మంది ప్రయాణికులకు ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కగా 2016....17లో రూ. 330 కోట్ల వ్యయంతో ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టు, అనంతరం వ్యయం పెరిగి రూ. 412.26 కోట్లకు చేరింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో వ్యయ భాగస్వామ్య పద్ధతిలో ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించారు. ప్రారంభ ఒప్పందం ప్రకారం వ్యయంలో 2/3 వంతు రాష్ట్ర ప్రభుత్వం, 1/3 వంతు రైల్వే శాఖ భరిస్తాయి. ప్రాజెక్టు అమలు బాధ్యతలను రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్వీఎన్ఎల్) చేపట్టింది.యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి రైలు మార్గ సౌకర్యం మెరుగుపరచడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం. ఘట్‌కేసర్, బిబినగర్, పగిడిపల్లి కేబిన్, భువనగిరి, యాదాద్రి స్టేషన్లు ఈ మార్గంలో ఉన్నాయి.ప్రాజెక్టు కోసం మెద్చల్-మల్కాజిగిరి, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో కలిపి 18.625 హెక్టార్ల ప్రైవేట్ భూమి అవసరమవుతోంది. భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. మార్గంలో 59 చిన్న వంతెనలు, ఒక ప్రధాన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. భూగర్భ పనులు, వంతెనలు, సిగ్నలింగ్ టెలికాం, ఎలక్ట్రికల్ మరియు బాలస్ట్ పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారు చేసి పనులు సమాంతరంగా కొనసాగిస్తున్నారు.ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు.మొదటి దశలో యాదాద్రి-భువనగిరి-పగిడిపల్లి (17.09 కి.మీ) పనులను 202627 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.రెండో దశలో పగిడిపల్లి-బిబినగర్-ఘట్‌కేసర్ (16.07 కి.మీ) పనులను 202728 నాటికి ముగించనున్నారు. మొత్తం ప్రాజెక్టును మూడు సంవత్సరాల్లో పూర్తి చేయాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.



# రంజాన్ మాసం సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు : సిపి వి.సి.సజ్జనార్

**చార్మినార్,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** రంజాన్ మాసం సందర్భంగా నగరంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ అన్నారు.కొద్ది రోజులలో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాతబస్తీ పురానీహవేలీలోని కొత్వాల్ హౌస్‌లో హైదరాబాద్ నగర్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ మంగళవారం ముస్లిం మత పెద్దలతో సమావేశమయ్యారు.నెల రోజుల పాటు కొనసాగే రంజాన్ వేడుకల భద్రతా ఏర్పాట్లపై ఆయన ముస్లిం మత పెద్దలతో సుధీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు.అనంతరం పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ,రాష్ట్ర మైనార్టీ విభాగం అధికారులతో కలిసి చార్మినార్ సమీపంలో ఉన్న చారిత్రక మక్కామసీదును సందర్శించారు.మక్కామసీదు పరిసర ప్రాంతాలను పరిశీలించి అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించారు.రంజాన్ మాసం సందర్భంగా ఇబ్బందులు కలగకుండ తగిన ఏర్పాట్లు చేయాలని నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్‌ను చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ కోరారు.ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రార్ధనలు కోసం విచ్చేసి వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండ పటిష్టమైన భద్రతా చర్యలుతీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రంజాన్ నెలలో షాపింగ్ కోసం పెద్ద ఎత్తున ప్రజలు వస్తారని,సాయంత్రం వేళల్లో ఇఫ్తార్ విందులలో పాల్గొంటారని,ఎటువంటి ఇబ్బందులు లేకుండ తగు ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.ప్రజలు తమ సహకారాన్ని పోలీసులకు అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు తఫ్సీర్ ఇక్బాల్,జాయింట్ సిపి ఎస్ఎం విజయ్ కుమార్,చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్,చార్మినార్ ఏసిపి చంద్రశేఖర్,చార్మినార్ ట్రాఫిక్ ఏసిపి లక్ష్మణ్,ఘాన్సీ బజార్ డివిజన్ ఎంఐఎం ఇంఛార్జి షాహిల్ అక్బర్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



మక్కామసీదును సందర్శించిన హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్

# టిటిడి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**- హాజరైన టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు**

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ టిటిడి దేవాలయంలో ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం భక్తజనసందోహం మధ్య కన్నుల పండుగగా ప్రారంభమయ్యాయి. టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు చేతుల మీదుగా ఇక్కడ బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో సోమవారం రాత్రి అంకురార్పణ వేడుకలను నిర్వహించారు. ఇక మంగళవారం ఉదయం 10.30 గంటలకు ధ్వజారోహణం కార్యక్రమాన్ని టిటిడి ఛైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి పెద్దశేష వాహనంపై ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా నేడు(బుధవారం) ఉదయం చిన్నశేషవాహన సేవ, రాత్రి హంస వాహన సేవను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో టిటిడి జూబ్లీహిల్స్ ఎల్ఏసీ ఛైర్మన్ ఎ. వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు ఈ నెల 25 వరకు కొనసాగుతాయి.



ధ్వజారోహణం వేడుకల్లో పాల్గొన్న ఛైర్మన్ బీఆర్ నాయుడు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు.

# ఉర్దూ మీడియాకు.. హాఫ్ డే స్కూల్స్

**19 నుంచి మార్చి 20వ తేదీ వరకు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టే వారి సౌకర్యార్థం ఉర్దూ మీడియం పాఠశాలల పనివేళలను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. ఈ నెల 19 నుండి మార్చి 20 వరకు ఈ కొత్త వేళలు అమలులో ఉండనున్నాయి. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలల పనివేళలను మారుస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లింల సౌకర్యార్థం ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలు కొనసాగుతాయి. ఈ కొత్త వేళలు ఈనెల 19 నుండి మార్చి 20 వరకు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ ఉర్దూ మీడియం పాఠశాలలు ఈ మార్పును అమలు చేయాలి. అలాగే సాధారణ పాఠశాలల్లోని ఉర్దూ మీడియం సెక్షన్లకు కూడా ఇదే వర్తిస్తుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఉర్దూ మీడియం డైట్ కళాశాలలు ఇదే తరహాలో నడుస్తాయి. పనివేళలు తగ్గించడం వల్ల కలిగే పని గంటల నష్టాన్ని పూడ్చేందుకు విద్యాశాఖ ప్రత్యేక సూచనలు చేసింది అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్ ఒక అదనపు రోజు పని చేయాల్సి ఉంటుంది. ప్రైమరీ స్కూల్స్ గతేడాది మాదిరిగానే రెండు పని దినాల్లో అదనంగా అర గంట పని చేయాల్సి ఉంటుంది.

# టోలిచౌకిలో కార్డెన్ సెర్చ్

**-పోలీసుల అదుపులో 23 మంది విదేశీయులు**

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫారమోంట్ కాలనీ, ఐఏఎస్ కాలనీ మరియు హకీంపేట కుంట ప్రాంతాలలో సోమవారం అర్ధరాత్రి భారీ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గోల్కొండ జోన్ డిసిపి చంద్రమోహన్ పర్యవేక్షణలో 250 మంది పోలీసు సిబ్బందితో పాటు 10 సెర్చ్ పార్టీలు, 7 కట్ ఆఫ్ పార్టీలు, 5 లిఫ్టింగ్ మరియు 2 హోల్డింగ్ పాయింట్లు పాల్గొని ఫారమోంట్ కాలనీతో పాటు, ఐఎఎస్ కాలనీ హాకీంపేట కుంట ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్ మరి యు ఆపరేషన్ నిర్వహించి తనిఖీలు చేపట్టడం జరిగింది. ఈ తనిఖీలలో వీసా గడువు ముగిసినా అక్రమంగా నివసిస్తున్న వివిధ దేశాలకు చెందిన 23 మంది విదేశీయులను గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో పాటు సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను, అక్రమంగా గ్యాస్ రీఫిలిం గ్ చేస్తున్న 9 గ్యాస్ సిలిండర్లు, నిబంధనలకు విరుద్ధంగా నిలువ ఉంచిన 53 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని డీసీపీ చంద్రమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నగర శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా ఇటువంటి తనిఖీలు చేయడం జరుగు తుందని, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఇలాంటి తనిఖీలకు ప్రజలు సహకరించాలని కోరారు.



కార్డన్ సెర్చ్‌లో భాగంగా స్థానికులతో మాట్లాడుతున్న డిసిపి చంద్రమోహన్.

## ముఖ్యమంత్రి నివాసానికి సమీపంలో చైన్‌స్నాచింగ్

**- స్నాచింగ్‌కు పాల్పడిన యువజంట**

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి నివాసానికి కూతవేటు దూరంలో చైన్ స్నాచింగ్ సంఘటన చోటుచేసుకొంది. బైక్‌పై వచ్చిన ఒక యువజంట ఈ స్నాచింగ్‌కు పాల్పడటం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. మాదాపూర్ కావూరిహిల్స్‌లోని ఒక పీజీ హాస్టల్‌లో నివసించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అయిన కడపల మానస(27) మంగళవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయానికి వెళ్లింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 39లోని వర్టిక్స్ సొల్యూషన్స్‌కు వెళ్లేందుకు రోడ్ నంబరు 44లో ఆర్‌టీవీ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుంది. దాదాపు 9.30 గంటల ప్రాంతంలో ఒక బైకుపై ఎదురుగా వచ్చిన జంట ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకొని అక్కడి నుంచి పరారైంది. కాగా బైకును యువకుడు నడుపుతుండగా బైకు వెనుక యువతి కూర్చొని ఈ గొలుసు స్నాచింగ్‌కు పాల్పడినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి అతి సమీపంలో ఈ స్నాచింగ్ జరగడంతో నిందితులను పట్టుకొనేందుకు టాస్క్‌ఫోర్స్‌తోపాటు స్థానిక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

### ఆధ్యాత్మిక భావాలను పెంపొందించాలి : ప్రకాశరావు



అన్నదానంలో పాల్గొన్న కల్యాణ వెంకటేశ్వరస్వామీ ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, బెలిదె రవిలు

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ఈరోజు అమావాస్య సందర్భంగా ఇంటర్‌నేషనల్ వైద్య ఫెడరేషన్ అడిక్ మెట్, బౌధనగర్ అధ్యక్షుడు బెలిదె రవికుమార్ ఆధ్వర్యంలో నామాల గుండులోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయము వద్ద అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ నోముల ప్రకాశరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దేవాలయాలు కట్టాలన్న, సత్రాలు నిర్మించాలన్నా, అన్నదానాలు చేయాలన్న ముందుంటార ని అన్నారు. ఈ కార్యక్రమంలో నామాలగుండులోని శ్రీ వీరాంజనేయస్వామీ ఆలయ మాజీ చైర్మన్ కాచం రాము, కాంగ్రెస్ నాయకుడు జలంధర్ రెడ్డి, కోటా శ్రీనివాస గుప్త, సోమ రామ్మోహన్, పొద్దుటూరి వెంకటేష్ గుప్తా, బెలిదె నరసింహారావు, ఎల్లంకి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

### మాజీ కార్పొరేటర్‌ను సన్మానించిన పారిశుధ్య కార్మికులు



శాంతి శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న కార్మికులు

**అల్వాల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** అల్వాల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డిని పారిశుధ్య కార్మికులు ఘనంగా సన్మానించారు. కార్పొరేటర్ పదవీ కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో కార్మికులు ఆమెను కలవడం జరిగింది. పది సంవత్సరాలు కాలంగా తనకు కార్మికులు అండగా ఉన్నారని శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కార్మికుల ఆప్యాయత మరువ లేనిదని జీవితాంతం గుర్తు ఉంటుందన్నారు. అనంతరం ఆమె కార్మికులతో కలిసి సహపంక్తి భోజనాలులో పాల్గొన్నారు.

### విద్యార్థుల పరీక్షల సమయంలో ఎన్నికలు నిర్వహించొద్దు

**-విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ**



విద్యార్థి నాయకులతో కలిసి మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

విద్యార్థుల పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రంలో జరిగే ఎన్నికలను వాయిదా వేయాలని తెలంగాణ విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ అన్నారు. విద్యార్థుల పరీక్షలు పూర్తయ్యాకనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విద్యార్థి నాయకులతో కలిసి మాట్లాడుతూ విద్యార్థుల పరీక్షలు పూర్తయ్యేవరకు ఎంపిటిసి, జెడ్‌పిటిసి, జిహెచ్‌ఎంసి, ఎంఎంసి, సిఎంసి,ఇతర సహకార సంస్థల ఎన్నికలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల సమయంలో ఎన్నికలు నిర్వహిస్తే ఆ ప్రభావం విద్యార్థుల పరీక్షలపై ప్రభావం చూపుతాయని అన్నారు.ఈ నెల 25 నుంచి ఇంటర్‌మీడియట్, మార్చి 14 నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్నాయని,అలాగే డిగ్రీ, పీజీ, ఇతర పోటీ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. మార్చి నెలాఖరులోగా పరిషత్ ఎన్నికలు నిర్వహించని పక్షంలో 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సి న 498కోట్ల నిధులు నిలిచిపోతాయనే సాకుతో విద్యార్థుల పరీక్షల ఇబ్బందికలిగేలా ఎన్నికలు నిర్వహించే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు హరి, వెంకటేష్, అర్జున్, రవి, నవీన్, ధర్మాచారి తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే యమపాశమే..!

**- కేబీఆర్ ఉద్యానవనం వద్ద ట్రాఫిక్‌పై అవగాహన**



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న యమధర్మరాజు వేషధారి, చిత్రంలో ఏసీపీ హరిప్రసాద్ తదితరులు.

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్తః**

బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు కూడలి వద్ద జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ పోలీసులు, సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా యమధర్మరాజు వేషధారణలో వచ్చిన వ్యక్తి మాట్లాడుతూ,"ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే ప్రమాదాలే కాకుండా ప్రాణాపాయ పరిస్థితులు ఎదురవుతాయి. గీత దాటడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి తప్పులు చివరికి కుటుంబాలను కన్నీళ్లపాలు చేస్తాయి" అని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లుగా నటిస్తూ కొందరిపై పాశం విసిరినట్లు చేసి, ప్రమాదాల తీవ్రతను ప్రత్యక్షంగా చూపించారు. జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్ట హరి ప్రసాద్ మాట్లాడుతూ,"ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయి. స్వల్ప నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారవచ్చని ప్రజలు గుర్తించాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సునీల్, ట్రాఫిక్ ఎస్ఐ గోవర్ధన్ రెడ్డి, సర్వేజన సంస్థ మేనేజర్లు అనీల్, సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ ప్లకార్డులు ప్రదర్శించి వాహనదారులకు అవగాహన కల్పించారు.

### మాజీ డిజిపి అరవిందరావుకు పరిషత్తు సాహిత్య పురస్కారం

**నాంపల్లి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** ఐపిఎస్ అధికారిగా పదవీ విరమణ చేసిన అనంతరం సంస్కృతంలో డాక్టరేట్ పరిశోధనతో పాటు వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, భగవద్గీత మొదలైన అంశాలలో లోతైన పరిశోధన, గ్రంథ రచన, ప్రసంగపరంపరలతో అవిశ్రాంతంగా కొనసాగిస్తున్న కృషికి గుర్తింపుగా సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ డిజిపి అరవిందరావుకు తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య మంగళవారం తెలిపారు. సంస్కృత భాషా సాహిత్యాలకు విశేష సేవలు అందించిన వారికి ప్రతీయేటా పరిషత్తు బహూకరించే విద్యాలంకార ముదిగంటి గోపాలరెడ్డి సాహిత్య పురస్కారం ఈ సంవత్సరం అరవిందరావుకు ప్రదానం చేయాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో పురస్కారంతోపాటు 25వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించనున్నట్లు చెన్నయ్య వెల్లడించారు.

# ఆక్రమణకు గురైన ప్రభుత్వ బిసి హాస్టల్ భవనం

**-పట్టించుకోలేని అధికారులు**

**-కార్ల షెడ్డు గోదాంగా మార్చుకున్న కబ్జాదారుడు**



మహేంద్రహిల్స్‌లో ఆక్రమణకు గురైన బీసీ హాస్టల్ భవనం

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ మారేడ్‌పల్లి మండలం మహేంద్రహిల్స్‌లో సంపన్నులు నివసించే అత్యంత ఖరీదైన ప్రభుత్వ స్థలంలో కోట్లాధి రూపాయల వ్యయంతో నిర్మించిన బీసీ హాస్టల్ భవనం ఆక్రమణకు గురైంది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఓ ప్రైవేట్ వ్యక్తి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఆ స్థలం,భవనాన్ని నప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడంతో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమైయ్యారు. మారేడ్‌పల్లి మండలం మహేంద్రహిల్స్‌లోని సర్వే నెం 844బై1లలో 2006 సంవత్సరంలో (20) యేండ్ల క్రితం బసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌ను నిర్మించేందుకు 2 వేల చదరపు గజాల స్థలాన్ని 2007లో రెవెన్యూ అధికారులు పంచనామ జరిపి బీసీ వెల్ఫేర్ శాఖకు అప్పగించారు. ఆ స్థలంలో సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్ నగర్ నియోజకవర్గాల బీసీ బాలికల హాస్టల్ నిర్మాణం కోసం అప్పట్లో 75 లక్షల రూపాయలు నిధులు మంజురు చేసింది. సర్వే నెం 844బై1లో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 312 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నట్లుగా రికార్డులు ఉన్నాయి. వాటిలో 12 ఎకరాలు, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు, మహాబోది బుద్ధ విశార్‌కు,మాతా అమృతానందమయి మఠంకు, జలమండలి ,బిఎస్‌ఎన్ఎల్ సంస్థలకు కేటాయించారు. ఉమ్మడి రాష్ట్రంలో 20 యేండ్ల క్రితం భవనాన్ని నిర్మించారు. అయితే ఆ ప్రభుత్వ భవనాన్ని ఆక్రమించుకున్న సదరు వ్యక్తి ఆ స్థలం,ఆ భవనం తమదేనని కోర్టులో ఫిజీషన్ వేశాడని, ప్రభుత్వ స్థలం,ప్రభుత్వ భవనం ఆక్రమణకు గురైనట్లు డబ్ల్యూ పీ నెం 21772బై 2018 స్టార్ ఇండియా కాంట్రాక్టర్ కోర్టులో ఫిటిషన్ దాఖలు చేసినట్లు, ఆ కేసు పెండింగ్‌లో ఉన్నట్లు అడ్వకేట్ జనరల్ స్పెషల్ జి.పీని ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ జిల్లా బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆసన్న తెలిపారు.

**కిరాయి ఇండ్లల్లో సంక్షేమ హాస్టళ్లు . .**

హైదరాబాద్ జిల్లాలో కొన్ని హాస్టళ్లకు సొంత భవనాలు లేక నెలకు లక్షలాది రూపాయలు ప్రభుత్వం అద్దెలు చెల్లిస్తుంది. ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమైయ్యారు. ఇప్పటికైనా రెవెన్యూ, బీసీ సంక్షేమ హాస్టళ్ల ఉన్నతాధికారులు స్పందించి కోట్లాధి రూపాయల విలువ చేసే ప్రభుత్వ భవనాన్ని స్వాధీనం చేసుకొని అటు బీసీ విద్యార్థులకు,ఇటు ప్రభుత్వ నిధికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఘనంగా పాటకు పట్టాభిషేకం.. ప్రముఖులకు పురస్కారాల ప్రదానం



పురస్కారాలను ప్రధానం చేస్తున్న రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య

**చిక్కడపల్లి ఫిబ్రవరి 17 ( ప్రభాతవార్త ) :** చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళా వెంకటదీక్షితులు కళావేదికలో మంగళవారం రాత్రి త్రివేణి సంగమం కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో పాటకు పట్టాభిషేక్తం పేరిట సంగీత విభావరి కార్యక్రమం అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్యగాన గంధర్వ డాక్టరు రాజా రామన్న నేతృత్వంలో జరిగింది. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హాజరై వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు ఈ సందర్భంగా గౌరవ పురస్కారాలను అందజేశారు. ఘంటసాల అవార్డును ఎం. రాంబాబు, పి.బి. శ్రీనివాస్ అవార్డును శ్రీనివాస్ మూర్తి, సాంస్కృతిక, సామాజిక సేవా పురస్కారాలను సంధ్యా వర్షిణి, మీసాల విజయ్, శ్రీమతి శారద, లింగి నరేందర్లకు అందించగా సావిత్రి బాయి పూలే స్మారకార్థం మహిళా సేవారత్న, వైఎస్ఆర్ సేవారత్న కళా సేవారత్న అవార్డులను పలువురు ప్రముఖులకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా డాక్టరు రాజా రామన్న ఆలపించిన ఘంటసాల గీతాలు, పద్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. పాటలు మరియు పద్యాల మేళవింపుతో సాగిన ఈ విభావరి ఆద్యంతం రంజింపజేసింది. ఈ కార్యక్రమానికి పలువురు కళాకారులు, సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### ఆరుదైన శ్రస్త చికిత్స చేసి రోగి ప్రాణాలు కాపాడిన ఉస్మానియా వైద్యులు



ప్రమాదవశాత్తు కడుపులోకి రాడ్ దిగిన వ్యక్తిని కాపాడిన ఉస్మానియా వైద్యులు

**గోషామహల్,ఫిబ్రవరి 17ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుండి కింద పడి కడుపులోకి రెండు రాడ్లు దిగిన వ్యక్తికి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన ఉస్మానియాఆసుపత్రి వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు.వివరాలోకి వెళ్లితే సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం,అలుగోలు గ్రామానికి చెందిన అత్కురి శ్రీనివాస్ (50)ఈనెల కూలీ పని నిమిత్తం జహిరాబాద్ మండలంలోని ఓ నిర్మాణంలో ఉన్న భవనంలో పని కోసం వెళ్లాడు .కాగా ఉదయం11గంటల సమయంలో మొదటి అంతస్తు నుండి గ్రౌండ్ ఫ్లోర్‌లోకి ప్రమాదవశాత్తు కింద పడటంతో గ్రౌండ్‌ని పిల్లర్లకు ఉన్న రాడ్లపై పడటంతో శ్రీనివాస్ కడుపులోకి దిగాయి. దీంతో 108సిబ్బంది శ్రీనివాస్‌ను అదే రాత్రి 8గంటల సమయంలో ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువచ్చారు.దీంతో క్యాజువాలిటి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి జనరల్ సర్జరీవిభాగానికి తరలించారు. జనరల్ సర్జరీ విభాగం వైద్యులు రోగినిఇ పూర్తిగా పరిశీలించి అన్ని వైద్య పరీక్షలనునిర్వహించి అనంతరం జనరల్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ పల్లం ప్రవీణ్‌కుమార్ బాధితుడి పరిస్థితి పరిశీలించారు.డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అదే రోజు రాత్రి 11గంటలకు ఆపరేషన్‌థియేటర్‌కు తరలించి ఎమర్జెన్సీ లాపరటామీ శస్త్ర చికిత్సను తన వైద్య బృందం,అనస్థీషియాహెచ్.డి.ఓ డాక్టర్ అభిమన్యు సింగ్,వైద్యబృందంతో కలిసి సుమారు 5గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స నిర్వహించి కడుపులో ఉన్న రెండు రాడ్లను విజయవంతంగా తొలగించారు.కాగా రోగి శ్రీనివాస్‌కు రెండు రాడ్లు కడపులోకి దూసుకుపోవడంతో పెద్ద ప్రేగు,చిన్న ప్రేగు,రక్తనాళాలుదెబ్బతిన్నాయి.వాటిని సరి చేస్తూ చికిత్స క్లిష్ట పరిస్థితిలో పూర్తి చేశారు.రెండు రాడ్లు పెద్ద రక్తనాళాన్ని తాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని హెచ్.ఓ.డి డాక్టర్ పల్లం ప్రవీణ్‌కుమార్ తెలిపారు .ప్రైవేట్ ఆసుపత్రిలోఅయితే సుమారుగా 10లక్షల రూపాయలు అవుతాయన్నారు.రోగివెంట సహాయకులు ఎవరు లేకున్నా వైద్యులే అన్ని తామై రోగికి సపర్యలు చేయడం విశేషం.రెండు వారాలలో రోగిని డిశ్చార్జీ చేయడం జరిగిందన్నారు.మరోసారి తమకు సాటిలేరనిఉస్మానియా ఆసుపత్రి వైద్యులు నిరూపించుకున్నారు.రోగి ప్రాణాలను కాపాడిన జనరల్ సర్జరీవిభాగం అధిపతి డాక్టర్ పల్లం ప్రవీణ్‌కుమార్,వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరిండెంటెంట్‌డాక్టర్ రాకేష్‌సహాయ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ శస్త్ర చికిత్సలోవైద్యులు అభిరామ్, గిరిధర్, వెంకటేశ్వర్,మన్మితతోపాటు అనస్థీషియా వైద్యులు,నర్సింగ్ విభాగం,సిబ్బంది పాల్గొన్నారు.

### వివేక్ వెంకటస్వామి, వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడికి నిరసనగా ధర్నా



బాల్కా సుమన్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న మాల మహానాడు కార్యకర్యలు. చిత్రంలో జి.చెన్నయ్య, వెంకటేశ్వర్లు తదితరులు

**సైఫాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** రాష్ట్ర మంత్రి వివేక్ సెంకటస్వామి, ఎంపి వంశీకృష్ణ కాన్వాయ్‌పై మాజీ ఎంపి బాల్కాసుమన్, బిఆర్ఎస్ నాయకుడు రాజీరెడ్డి రాళ్ళతో దాడి చేశారని ఆరోపిస్తూ ఆనేక మంది మాల మహానాడు కార్యకర్తలు మంగళవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బాల్కా సుమన్ దిష్టి బోమ్మను దగ్ధం చేసి వారికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ వివేక్ వెంకటస్వామి, వంశీకృష్ణ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై చెన్నూరు వద్ద బిఆర్ఎస్ కార్యకర్తలు రాళ్ళతో దాడి చేయదాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉండాలే కాని దాడులకు పాల్పడటం సరైన పద్దతి కాదని బాల్కాసుమన్‌కు సూచించారు. రాజీరెడ్డి అనే వ్యక్తి ఒక పథకం ప్రకారం వివేక్‌పై దాడికి కుట్ర పన్నారని ఆరోపించారు. మంత్రిగా ఉన్న వివేక్ ప్రజా బలంతో రోజురోజుకు ఎదుగుతున్నారని, దీన్ని జీర్ణించుకోలేని బాల్కా సుమన్ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కట్టు శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యఅక్షుడు పరిమి కోటేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగి ఆనందరావు, నాయకులు మర్పల్లి శ్రీకాంత్, పి.జయ కుమార్, లలిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### దేవరకొండ బస్తీలో పర్యటించిన మాజీ కార్పొరేటర్



దేవరకొండ బస్తీలో పర్యటిస్తున్న భారతీనాయక్ తదితరులు.

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్తః** వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లోని దేవరకొండ బస్తీలో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ సహకారంతో ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి హామి నిచ్చారు. ఈ సంరద్భంగా పలువురు బస్తీలో డ్రైనేజీ, చెత్త, తాగునీటి పైపులైను సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అలాగే వీధిదీపాల సమస్యలను కొంత మంది ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నగరంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. చాలా మేర బస్తీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు చెక్ పెట్టామన్నారు.ఈ కార్యక్రంలో ఆమెతోపాటు కాంగ్రెస్ నేతలు రాములు చౌహాన్, బాబా నాయక్, అక్బర్, మునీర్, మసూద్, రఫీక్, జావిద్, ఫిరోజ్, రవి, సురేష్, ఇషాక్, బాబు, ముజ్జు, నయీం. ప్రతాప్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పుగూడలో గంజాయి చాక్లెట్ల పట్టివేత

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** ఉప్పుగూడలో గంజాయి చాక్లెట్లను తండైలో కలిపి అధిక ధరకు విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ ఎస్టీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. వివరాలలోకి వెళితే ఉత్తరప్రదేశ్ ఆగ్రాకు చెందిన బి.వికాస్ శర్మ (23) బేగంబజార్‌లో ఉంటూ ఇటీవలే ఉప్పుగూడకు మకాం మార్చాడు. శివరాత్రి పర్వదినం సందర్భంగా జాగరణ చేసే వారి కోసం గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్టీఎఫ్ అధికారులు అతని ఇంటిపై దాడిచేసి తనిఖీలు నిర్వహించారు. అతని నివాసం నుండి సుమారు 9.6కిలోగ్రాముల బరువు చేసే 1,920 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో చాక్లెట్‌లో సుమారు 5 గ్రాముల గంజాయి కలిపినట్లు అధికారులు తెలిపారు. మామూలు రోజుల్లో గ్లాసు రూ.50కి విక్రయించే చాక్లెట్‌ను రూ.150కి విక్రయించాడు. ఆగ్రాలో వీటిని రూ.10కి విక్రయిస్తారు. తదుపరి విచారణ నిమిత్తం వికాస్ శర్మను, గంజాయి చాక్లెట్లను చార్మినార్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. దర్యాప్తు కొనసాగిస్తుంది. అయితే చాక్లెట్లలో గంజాయి ఉందా..? లేదా..? అన్న విషయంతోపాటు వాటిని ఎక్కడి నుండి సేకరించాడన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్‌రావు వెల్లడించారు.

### వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**-32 ఏళ్ల అనుబంధం.. రూ. 25 లక్షల విరాళం**



మంగళవారం వివేక్ నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని దార్శికున్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**చిక్కడపల్లి ఫిబ్రవరి 17 ( ప్రభాతవార్త ) :** నమ్మిన భక్తులకు కొంగుబంగారమై విరాజిల్లుతున్న వివేక్ నగర్ లోని స్వయంభూ శ్రీ ఆంజనేయ స్వామి వారిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సతీసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ చైర్మన్ జానకీ సుధాకర్ , ఈఓ మాచర్ల దేవనాథం అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయం ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ, కందాళ వేంకటాద్రి ఆధ్వర్యంలో మహేష్ కుమార్ గౌడ్ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జానకీ సుధాకర్ మరియు ఈఓ మాచర్ల దేవనాథం శాలువాతో ఘనంగా సన్మానించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తనకు ఈ దేవస్థానంతో సుమారు 32 ఏళ్లగా అనుబంధం ఉందని, స్వామి వారు న్యాయబద్ధమైన కోరికలు తీర్చే కొంగుబంగారమని, తన అనుభవంలో స్వామి వారి కృప ఎంతో ఉందని కొనియాడారు. ఆలయ చైర్మన్, ఈఓ విన్నపం మేరకు సుమారు రూ. 25 లక్షల వ్యయంతో ఆలయ కల్యాణ మండపాన్ని సుందరీకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసి పంపాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, తెలంగాణ ప్రదేశ్ యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మందాడి అరవింద్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు నాగభూషణం, కమిటీ సభ్యులు నెల్లి శ్యాంకుమార్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళనం పురస్కారాల ప్రదానం



అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళనంకి పురస్కారాల ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి ఫిబ్రవరి 17 ( ప్రభాతవార్త ) :** భాషా సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన వారికి అందించే ప్రతిష్టాత్మక అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళనం జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ సభ మంగళవారం జరిగింది. తెలంగాణకు చెందిన పలువురు ప్రముఖ సాహిత్యకారులు, భాషావేత్తలు వివిధ విభాగాల్లో భూపాల్‌లోని రాజు సదన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్నారు. రాష్ట్రీయ భాషా గౌరవ సన్మాన్ పురస్కారాన్ని డాక్టర్ ఎన్. గోపాలకృష్ణ , సరస్వతీ సన్మాన్ పురస్కారాన్ని డాక్టర్ కర్నాటి లింగయ్య, డాక్టర్ పులివర్తి కృష్ణమూర్తి , భారత్ భాషా భూషణ్ పురస్కారాన్ని ఎన్.వి. రఘువీర్ ప్రతాప్, కాశీ విశ్వేశ్వరరావు, సంస్కృతి భూషణ్ పురస్కారాన్ని డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ , సాహిత్య శ్రీ పురస్కారంను డాక్టర్ పండు కృష్ణ కౌండిన్య, పెద్దూరి వెంకట దాస్, ఎర్రోజు వెంకటేశ్వర్లు, అదే విధంగా డాక్టర్ పోతుకుచి సాంబశివరావు ఎక్సలెన్సు అవార్డు ను గొల్లమూడి పద్మావతి అందుకున్నారు. సాహిత్య శ్రీ పురస్కారాన్ని డాక్టర్ పండు కృష్ణ కౌండిన్య, పెద్దూరి వెంకట దాస్, ఎర్రోజు వెంకటేశ్వర్లు, సమన్వయశ్రీ పురస్కారం డాక్టర్ నాగేశ్వరరావు అందుకున్నారు. ఈ పురస్కారాలను అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళనం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డాక్టర్ కడారు సత్యమూర్తి , ఎన్వీ రఘువీర్ ప్రతాప్ జనరల్ సెక్రెటరీ కోశాధికారి గోళ్ళమూడి పద్మావతి, పేర్ల ప్రతిపాదించగా జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వీరేంద్ర సింగ్క, కృతి చతుర్వేది ఆమోదించారు. రఘునందన్ ఆచార్య జీ , యతీంద్రనాథ్ జీ , విజయ్ దత్త ఆచార్య జీ, రామ్ వల్లభ జీ ఆచార్య వీరేంద్ర సింగ్ జీ చేతుల మీదుగా అవార్డులను ప్రధానం చేశారు.

### వారితో పదేళ్ల ప్రయాణం.. చివరికి అక్కడే మృతి

**- ఆటోడ్రైవర్‌కు నిమ్స్ సిబ్బంది తుదివీడ్కోలు**

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్తః**

పదేళ్లుగా నిమ్స్ ఆసుపత్రితో అనుబంధం ఉన్న ఒక ఆటో డ్రైవర్ ఆసుపత్రి ప్రాంగణంలోనే మృతిచెందిన సంఘటన ఇది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. ఆటోడ్రైవర్‌గా పనిచేసే వెంకట నారాయణ రమేష్ అనే వ్యక్తి నిమ్స్ ఆసుపత్రి స్టాఫ్ నర్సులను పదేళ్లుగా వారి ఇళ్ల నుంచి తీసుకురావడం, విధులు పూర్తైన తరువాత తీసుకొని వెళ్తుండేవాడు. ఈ క్రమంలోనే అతను ప్రతి రోజు క్రమం తప్పకుండా నిమ్స్ ఆసుపత్రికి వస్తుండేవాడు. ఉద్యోగులను తీసుకెళ్లడంతోపాటు అక్కడున్న సిబ్బందితో ఆయనకు అనుబంధం ఏర్పడింది. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం వెంకట నారాయణ రమేష్ తన ఆటో(టీఎస్ 09 యూబీ 6381)లో స్టాఫ్ నర్సులను వారి ఇంటికి తీసుకెళ్తున్న క్రమంలో నిమ్స్ ప్రధాన గేటు వద్ద ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో అతన్ని వెంటనే నిమ్స్ ఆసుపత్రి అత్యవసర విభాగానికి తరలించారు. అక్కడ చికిత్స అందించే క్రమంలో పరిస్థితి విషమించి అతను మృతి చెందాడు. కాగా ఆటో డ్రైవర్ మరణ వార్త తెలుసుకొని నిమ్స్ నర్సులు, స్టాఫ్ నర్సులు, ఉద్యోగులు, సిబ్బంది చాలా మంది అతనికి నివాళులు అర్పించారు. అతనితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పదేళ్లుగా తమతోపాటు ప్రయాణం చేస్తున్నాడంటూ కన్నీరు పెట్టారు. కాగా వెంకట నారాయణ రమేష్ మృతిపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 19న భూపతి చంద్ర స్మారక కథానికల పురస్కారాల ప్రదానోత్సవం

**హైదరాబాద్ ఫిబ్రవరి 17 ( ప్రభాతవార్త ) :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపురమునకు చెందిన "భూపతి చంద్ర" మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ 2026 పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 19 న నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ ఎమ్.ఎల్. కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం, తెలంగాణ సారస్వత పరిషత్తు లో జరిగే కార్యక్రమంలో ఈ పోటీలో విజేతలుగా నిలిచిన రచయితలకు నగదు పురస్కారాలను అందజేయనున్నారు.ప్రథమ, ద్వితీయ, తృతీయ మహుమతుల కింద పది వేలు, ఎనిమిది వేలు, ఆరు వేలు ఇవ్వడంతో పాటు ఐదుగురికి ప్రోత్సాహక బహుమతుల కింద రెండువేల చొప్పున అందజేస్తారు. ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలి కన్వీనర్ ప్రొ. సి. మృణాళిని, విశిష్ట అతిథిగా ప్రముఖ పాత్రికేయులు కె. శ్రీనివాస్, గౌరవ అతిథిగా ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ ఖదీర్ బాబు, ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీ దర్శకులు బి. నర్సింగ రావు హాజరుకానున్నారు. సభను సి.ఎస్. రాంబాబు పర్యవేక్షిస్తారని,సాహితీ అభిమానులు, రచయితలు అందరూ ఈ వేడుకకు హాజరై జయప్రదం చేయాలని అధ్యక్షులు ఎమ్.ఎల్. కాంతా రావు కోరారు. బహుమతులకు ఎంపికైన రచయితలందరికీ ఆయన ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నిజాంపేట్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

11 కెవి ఎసి టైర్లు, మల్లంపేట, శ్రీహోమ్స్, ప్రణీత్, గోతిక్, రిసీనియా ఫీడర్‌లలో నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కెవిఆర్ రెయిన్బో కాలనీ, బ్లాక్ డైమండ్ కాలనీ, రిసీనియా, గోతిక్, ప్రణీత్, శ్రీహోమ్స్ కాలనీ, క్రాంతి నగర్, అస్ బృందవన్ కాలనీ, హాయ్ రైజ్ విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని బాచుపల్లి ఏఈ ఎ.శశిధర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

**మయూరి నగర్ సబ్ స్టేషన్‌లో..**

11కేవీ వెంకట్ సాయి ఫీడర్‌లో నేడు ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు వెంకట్ సాయి ఎన్‌క్లేవ్, బాటా షోరూమ్ వెనుక ప్రాంతం, పుష్పక్ అపార్ట్‌మెంట్‌లు, వెర్టెక్స్ లేక్ వ్యూ విల్లాలు, ఈశ్వర్ విల్లాలు, నిజాంపేట ప్రధాన రహదారి ప్రాంతం, క్రేయాన్ స్కూల్ ప్రాంతం, వజ్రా ప్రతీక్ ఎదురుగా ఉన్న ప్రాంతం, శ్రీనివాసం అపార్ట్‌మెంట్‌లలో అలాగే,

**నిజాంపేట సబ్ స్టేషన్‌లో..**

11కేవీ భవ్యాస్ ఫీడర్‌లో మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంటల వరకు భవ్యాస్ అపార్ట్‌మెంట్‌లు, కాకతీయ నగర్, ఈశ్వర్ విల్లాలు, పంచశీల కాంప్లెక్స్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ ప్రధాన రహదారి,

**ప్రశాంతి హిల్స్ సబ్ స్టేషన్‌లో..**

11కేవీ పాండురంగ ఫీడర్ మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బందారి లేఅవుట్ రోడ్ నెం 10ఏ, రెడ్డి అవెన్యూ, రాజధాని స్కూల్ ఏరియా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

### హల్దీరామ్స్‌లో ఫంగస్ సోకిన స్వీట్స్ విక్రయం

**-పోలీసులకు ఫిర్యాదు చేసిన కస్టమర్**




**అత్తాపూర్ ఫిబ్రవరి17, ప్రభాతవార్త :** ఆఫర్ల పేరుతో హల్దీరామ్స్‌లో గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించడంతో కస్టమర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.హల్దీరామ్‌లో ప్రజారోగ్యాన్ని ముప్పు కలిగిలా ఫంగస్‌తో కలిగిన స్వీట్స్‌ను అమ్మడం కలకలం రేపింది.ఈ ఘటన ఉప్పర్‌పల్లిలోని హల్దీరామ్ స్వీట్ షాప్‌లో చోటుచేసుకుంది. కస్టమర్ సిద్దార్థ (29) తన సోదరి ఝాన్సీతో కలిసి అత్తాపూర్ ఉప్పర్‌పల్లిలోని హల్దీరామ్ స్వీట్ షాప్‌కు వచ్చారు.ఈ క్రమంలో స్వీట్లు,సమోసాలు కొనుగోలు చేయగా గమనించిన వారు స్వీట్‌పై ఫంగస్ కనిపించింది.దీంతో వెంటనే సెల్స్ మ్యాన్‌ను ప్రశ్నించగా బాధ్యతాయుతంగా స్పందించడంతో అహంకారం ప్రదర్శించడాన్ని కస్టమర్లు వాపోయారు.దీంతో అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో పోలీసులు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన ఎస్‌హెచ్‌ఓ నాగేశ్వర్ రావు కేసు నమోదు చేసి గడవు ముగిసిన పదార్థాలను స్వీకరించి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

### అధిక లాభాలంటూ ప్రైవేటు మహిళా ఉద్యోగికి బురిడీ

**- రూ. 1.50 లక్షలు కాజేసిన సైబర్ కేటుగాళ్లు**

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్తః**

పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి ఒక మహిళా ప్రైవేటు ఉద్యోగిని సైబర్ మోసగాళ్లు దాదాపు రూ. 1.50లక్షలు మోసగించిన సంఘటన ఇది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. బేగంపేట ప్రాంతంలో నివసిస్తూ ప్రైవేటు ఉద్యోగిగా పనిచేసే మిష్కా సుమన్ జెండీ(22) ఈ నెల 12న పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ప్రకటనను చూశారు. ఆమె తన ఆసక్తి చూపడంతో ఆమె వాట్సాప్‌కు ఒక మొబైల్ నంబరు నుంచి మెసేజ్ వచ్చింది. అది నమ్మిన ఆమె పలు దఫాలుగా దాదాపు రూ. 1.51లక్షలు పెట్టుబడి పెట్టింది. అవతలి వ్యక్తి మరింత పెట్టుబడి పెట్టాలంటూ పదేపదే కోరడంతో అనుమానం వచ్చిన ఆమె ఎన్‌సీఆర్‌పీని సంప్రదించారు. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గుండ్లపోచంపల్లి చెరువు వద్ద యువకుడు మృతదేహం లభ్యం

**పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

గుండ్ల పోచంపల్లి చెరువు వద్ద యువకుడు మృతదేహం లభించిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షబాజ్ ఆలమ్ (21) ఉపాధి నిమిత్తం బలరాంపూర్ జిల్లా, ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చి, అతని స్నేహితుడు, రూమ్‌మేట్ అయిన జుహైబ్ ఖాన్‌తో కలిసి గుండ్లపోచంపల్లిలో నివాసం ఉంటూ చార్మాస్ కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. కాగా గత కొన్ని రోజులుగా షబాజ్ ఆలమ్ మానసిక ఆందోళనతో తరచుగా 2-3 రోజుల పాటు బయటికి వెళ్లి తిరిగి గదికి వచ్చేవాడు. 13.02.2026న గది నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. 17.02.2026న ఉదయం సుమారు 10:00 గంటలకు గుండ్లపోచంపల్లి చెరువు వద్ద, ఉర్జిత విల్లాస్ ఎదురుగా, ఒక మృతదేహం కనిపించినట్లు సమాచారం అందింది. అక్కడికి వెళ్లిన జుహైబ్ ఖాన్ ఆ మృతదేహాన్ని తన స్నేహితుడు షబాజ్ ఆలమ్‌గా గుర్తించారు. అతని తల్లితండ్రులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### తెలంగాణ టెక్స్‌టైల్స్ ఏజెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**చార్మినార్,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** తెలంగాణ టెక్స్‌టైల్స్ ఏజెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు.అసోసియేషన్ కొత్త ప్రెసిడెంట్‌గా పాతబస్తీ రికాబ్‌గంజ్ ప్రాంతానికి చెందిన కిషన్ అగర్వాల్ (గుడ్డు భాయి) నియమితుయ్యారు.కార్యదర్శిగా శ్రీకాంత్ దారక్,కోశాదికారిగా నేమ్‌చంజ్‌జీ భారాడియా,ఉపాధ్యక్షులుగా ధన్‌రాజ్ భాసి,రాకేష్ అగర్వాల్,సంయుక్త కార్యదర్శిగా సుశీల్ జైన్,జాయింట్ కోశాధికారిగా దీపేష్ బైద్,కార్యవర్గ సభ్యులుగా రోహిత్ అగర్వాల్,అమృత్ ఖండేల్‌వాల్,దిలీప్ ఖండేల్‌వాల్,ప్రకాష్ రావల్,సుదర్శన్,గౌతం జైన్,సురేష్ మహేశ్వరి,దేవరాజ్ సంక్లేష,లలిత దోషి,తేజాస్ బండారి,గోపాల్ శర్మ,దినేష్ సింగారియా,దినేష్ కామ్‌దార్,బాబుభాయి,సలహాదారులుగా ముఖేష్ కటారియా,విజయ్ అగర్వాల్‌లు ఎన్నికయ్యారని అసోసియేషన్ అధ్యక్షులు కిషన్ అగర్వాల్ తెలిపారు.రెండు సంవత్సరాలు పాటు అసోసియేషన్ కార్యవర్గం పని చేస్తుందని ఆయన వెల్లడించారు.

## దేవీ నల్లపోచమ్మ, కట్టమైసమ్మ ఆలయాల వద్ద అన్నదానం



బోయిన్‌పల్లిలో అన్నదానం చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం బాపూజీ నగర్ శ్రీ దేవీ నల్లపోచమ్మ జయ నగర్ చౌరస్తా, కట్టమైసమ్మ ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఖలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అజిత్ కళ్యాణ్, నర్సింహ్మా, శ్రీకాంత్, రామారావు, విశ్వనాధ్, ప్రేమ్, శ్రీనివాస్ గౌడ్,సత్య నారాయణ, నాగేశ్, శశిధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో రుద్రహోమం



శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు.

**బేగంపేట ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకుని రుద్రహోమం లో పాల్గొన్నారు.హోమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి ,పౌండర్ ఫ్యామిలీ మెంబర్ కుటుంబ సభ్యులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.హోమం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసారు.

## అమ్మవారు భక్తులను చల్లగా చూడాలి -శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి



మహాకాళీ అమ్మ వారిని దర్శించుకున్న శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి.

**బేగంపేట ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారు భక్తులను చల్లగా చూడాలంటూ నైమిశారణ్య శ్రీవారాహీ పీఠాధిపతులు శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి అన్నారు.మంగళవారం శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మ వారు ప్రజలందరినీ చల్లగా చూడాలంటూ ఆయన ఆకాంక్షించారు.

## మహిళలకు కుట్టుమిషిన్లు అందజేసిన ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ



మహిళలకు కుట్టుమిషిన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** మహిళల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, సమగ్రాభివృద్ధికి మజ్లిస్ పార్టీ కట్టుబడి ఉందని చాంద్రాయణగుట్ట శాసనసభ్యులు, శాసనసభలో మజ్లిస్ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ స్పష్టం చేశారు. మంగళవారం బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఓవైసీ కేజీ టూ పీజీ క్యాంపస్‌లో నియోజక వర్గ మహిళలకు ఉచితంగా కుట్టు మిషిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ స్వయం ఉపాధికి మద్దతు ఇవ్వటం, గృహ జీవనోపాధి బలోపేతం చేయటం ద్వారా మహిళలు సాధికారత సాధిస్తారన్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక స్వయం సావలంభన సాధించే దిశగా మజ్లిస్ పార్టీ వారికి నిరంతరం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

## కొంపల్లి సర్కిల్ 56లో ఆస్తిపన్ను బకాయిలపై కఠిన చర్యలు

**కొంపల్లి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**



దుకాణాలను సీజ్ చేస్తున్న దృశ్యం

కొంపల్లి సర్కిల్ 56 పరిధిలోని శుభాష్ నగర్ ప్రాంతంలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని వాణిజ్య దుకాణాలపై మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత దుకాణ యజమానులు పన్ను బకాయిలను చెల్లించకపోవడంతో, నిబంధనల ప్రకారం రెండు దుకాణాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పన్నులు నగర అభివృద్ధి, పారిశుధ్యం, రహదారుల మరమ్మత్తులు, వీధి దీపాల నిర్వహణ తదితర పౌరసేవల నిర్వహణకు కీలకమని తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలు ఉన్న ఇతర యజమానులు తక్షణమే బకాయిలు చెల్లించాలని, లేకపోతే ఇలాంటి కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సిహెచ్. శ్రీనివాస్ గౌడ్, బిల్ కలెక్టర్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్సులపై సమావేశం

**కొంపల్లి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం అన్ని సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లతో కలిసి ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అనేక దుకాణాలు సరైన ట్రేడ్ లైసెన్స్ లేకుండా లేదా లైసెన్స్ రెన్యువల్ చేయకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని జోనల్ కమిషనర్ తెలిపారు. పట్టణంలో వ్యాపారం నిర్వహిస్తున్న ప్రతి వ్యాపారి ముందుగా కార్పొరేషన్ నుండి వ్యాపార అనుమతి పొందిన తరువాతే వ్యాపారం ప్రారంభించాలన్నారు. గతంలో లైసెన్స్ పొందిన వారు తక్షణమే రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించిన పక్షంలో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం 1955 ప్రకారం దుకాణాలను సీజ్ చేసే అధికారం అధికారులకు ఉందని హెచ్చరించారు. వ్యాపారులు కొత్త లైసెన్స్ కోసం లేదా రెన్యువల్ కోసం జీహెచ్ఎంసీ అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా కొంతమంది పన్నుదారులు ఆస్తిపన్ను బకాయిలు చెల్లించకపోవడం గమనించబడిందని పేర్కొన్నారు. బకాయిలను తక్షణమే చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఆస్తులు జప్తు చేయబడతాయని స్పష్టం చేశారు.

## సిఎం చొరవతో అంబర్‌పేట అభివృద్ధికి నిధులు : మాజీ ఎంపి హనుమంతరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపి వి.హనుమంత రావు అన్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో విహెచ్ నివాసం వద్ద 27లక్షల వ్యయంతో చేపట్టిన సిసి, బీటీ రోడ్డు పనులను బాగ్‌అంబర్‌పేట డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ శంభుల ఉషశ్రీకాంత్ గౌడ్, పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పి.నారాయణ స్వామి తదితరులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంబర్‌పేట నియోజకవర్గానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో ఇప్పటివరకు సుమారు 1.70 కోట్లతో అభివృద్ధి పనులను పూర్తి చేశామని ఆయన తెలిపారు. మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు, బాగ్ అంబర్‌పేట డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ శంభుల ఉష శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



అంబర్‌పేటలో రోడ్లను పరిశీలిస్తున్న మాజీ ఎంపి వి.హనుమంతరావు, చిత్రంలో శంభుల శ్రీకాంత్‌గౌడ్, పి.నారాయణస్వామి, రామోహ్మన్

ఇన్‌చార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపి వి. హనుమంతరావు,అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలోని, బాగ్ అంబర్‌పేట డివిజన్‌కి ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు డివిజన్లో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు, కమిటీ హాల్ నిర్మాణం, మంచినీటి పైప్ లైన్లతో పాటు తెల్లరేషన్‌కార్డులు, పింఛన్లు, అందచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.నారాయణస్వామి,రామ్మోహన్, జమీర్ పాల్గొన్నారు

## ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఐయ్యద్ అజీజ్ పాషా

**సైఫాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** గడిచిన ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనార్టిలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ జాతీయ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సయ్యద్ అజీజ్‌పాషా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ డిమాండ్లు అమలు జరుగుతాయని ఎంతో అశతో ముస్లింలు కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం ఓట్లు వేసి, కీలక పాత్రను పోషించారని కాని ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. ఆల్ ఇండియా ముస్లిం మైనార్టి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనార్టిలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని, వక్ఫ్ బోర్డులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారించాలని, న్యాయమైన అధికారాలను అప్పగించాలని, పేద ముస్లిం సమాజం కోసం 2004లో ఏర్పాటు చేసిన సచార్, రంగనాధ్‌మిశ్రా కమిషనల నివేదికలను పరిగణంలోకి తీసుకుని అమలు చేయాలని, జంటనగరాలలోని ముస్లింల స్మశాన వాటికిలు నిండిపోయాయని, స్మశాన వాటికిలకు పట్టణ, నగరాలలో స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో సిఎం ప్రకటించిన విధంగా వక్ఫ్ బోర్డు ఆస్తులపై సమగ్రంగా విచారణ జరిపించాలని, ఉర్దు భాషాను పరిరక్షించాలని, ఖాళీగా ఉన్న ఉర్దు అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థులకు ఫీజలను రీయంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని, నిరుపేద ముస్లింలకు ఇంటి స్థలం కోసం ఒక్కొక్కరికి 100 గజాల చొప్పున వక్ఫ్ బోర్డు నుంచి స్థలాన్ని కేటాయించాలని, రాష్ట్రంలో 4 శాతం రిజర్వేషన్లను ముస్లింలకు పటిష్టంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఛైర్మన్ సయ్యద్ ముక్తార్‌హుస్సేన్, ప్రతినిధి ఎం.ఎ.సిద్దిఖి పాల్గొన్నారు.

## బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా ప్రవీణ్ ముదిరాజ్



కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్‌కు తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా నియామక పత్రం అందజేస్తున్న సంఘం జాతీయ అధ్యక్షుడు,ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్ ను నియమిస్తూ కృష్ణయ్య నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చట్టం చేసి అమలు చేయరా అని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను పాలకులు కాలరాస్తున్నారని, బీసీ వ్యతిరేఖ దోరణి విడనాడి.. బీసీలకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్‌లకు ఈ సందర్భంగా ప్రవీణ్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## తరుణ్ చుగ్‌ను కలిసిన బిజెపి నాయకులు



**యాకుత్‌పుర,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరానికి విచ్చేసిన బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ను చార్మినార్ నియోజకవర్గం నూర్‌ఖాన్ బజార్‌కు చెందిన తెలంగాణ రాష్ట్ర మాజీ అధికార ప్రతి నిధి మీర్ ఫిరాసత్ అలీతో పాటు పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు..ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## నాగసాధువులకు ఘన సత్కారం



నాగసాధువులను సత్కరిస్తున్న తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

**ముషీరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** కాశీ, కేదార్‌నాథ్, ద్వారక, హరిద్వార్‌ల నుంచి మహాశివరాత్రి సందర్భంగా నగరానికి విచ్చేసిన నాగసాధువులను తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి ఘనంగా సత్కరించారు. మంగళవారం కవాడిగూడలోని గోవర్ధన్‌రెడ్డి ఇంటికి వచ్చిన నాగసాధువులు గోవర్ధన్‌రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ఆశీస్సులు అందించారు.

## టిఎన్‌జిఓ కాలనీకి బస్సులు నడపాలి

-టిఎన్‌జిఓ కేంద్ర సంఘం ప్రతినిధులు వినతి




ఆర్‌టిసి మంత్రి పొన్నంప్రభాకర్‌కు వినతిపత్రం అందచేస్తున్న టి.ఎన్.జి.ఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

**గన్‌ఫౌండ్రి,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** టి.ఎన్.జి.ఓ మాక్ లిమిటెడ్,గచ్చిబౌలికి ఆర్.టి.సి బస్సులను నడుపాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలంగాణనాన్ గజిటెడ్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేనీలు వినతిపత్రం అందచేశారు.టి.ఎన్.జి.ఓ వినతి మేరకు స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే టి.ఎస్.ఆర్.సి మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి (ఐపిఎస్)కు ఆదేశాలుజారీ చేశారు.వీలైనంత తొందరలో టి.ఎన్.జి.ఓ కాలనికి బస్సులను నడిపించేందుకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో టి.ఎన్.జి.ఓ కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్,హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్‌కుమార్,కార్యదర్శి కె.శ్రీనివాస్‌కార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి గొప్ప ప్రయోజకులు కావాలి : కూన శ్రీశైలం గౌడ్



విద్యార్థులతో కూన శ్రీశైలం గౌడ్

**కొంపల్లి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** ప్రతీ విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదువుకుని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గొప్ప ప్రయోజకులు కావాలని కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 281వ డివిజన్ రంగారెడ్డి నగర్ (గాంధీనగర్)లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు శాకీర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హాజరై విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో పాటు విద్యను సక్రమంగా అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యను తెలుసుకుని ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని కోరారు. అలాగే పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉచిత పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేసిన స్థానిక కాంగ్రెస్ నాయకుడు శాకీర్‌ను ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయ బృందం, స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేయాలి

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :**



ఛాత్రోపాధ్యాయుల ముగింపు సమావేశంలో డిప్యూటీ ఐఓఎస్ రామ్మోహన్, ఉపాధ్యాయులు

పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని అంకితభావంతో నిర్వర్తించాలని బహదూర్‌పురా డిప్యూటీ ఐఓఎస్ కె.రామ్మోహన్ అన్నారు. మంగళవారం దారుల్‌షిఫాలోని ప్రభుత్వ బాలుర అంధుల పాఠశాలలో ఛాత్రోపాధ్యాయుల (టీసీటీవీహెచ్) ముగింపు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు తమ శిక్షణా కాలంలో గ్రహించిన అనుభవాలను సమావేశంలో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ఇంచార్జ్ సద్గుణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండడి వెంకట్‌రెడ్డి, డైట్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు ఇంద్రారెడ్డి, ఝాన్సీ రెడ్డి, చాత్రోపాధ్యాయులు మహేందర్, శివుడు, మహేష్, శ్రీనివాస్, చెన్నకేశవరెడ్డి, స్రవంతి, ప్రేమాలమ్మ, ప్రియాంక, శ్రామిక, నరేందర్, రాజు, రాఘవేంద్ర, రాజు, నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్చురీలో భద్రపర్చిన మహిళా మృతదేహం

**అఫ్జల్‌గంజ్,ఫిబ్రవరి 17ప్రభాతవార్త:** ఉస్మానియా ఆసుపత్రిలో వెయింటిగ్‌హాల్ పడి ఉన్న గుర్తుతెలియని మహిళాను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించినట్లు అఫ్జల్‌గంజ్ ఎ.ఎస్.ఐ.బి.కృష్ణ తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాలప్రకారం... సుమారు 40 సంవత్సరాల గుర్తు తెలియని మహిళా ఉస్మానియా ఆసుపత్రిలోనివెయింటిగ్ హాల్ స్పృహ్హ తప్పి పడిపోయి ఉంది.స్పృహ్హ తప్పి పడిపోయి ఉన్న మహిళాను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో ఓపి విభాగానికి తీసుకు వెళ్లగా అప్పటికే మరణించి పడిఉన్నట్లు ఆసుపత్రి వైద్యులు ధృవీకరించినట్లు తెలిపారు.మృతదేహంపై నైట్‌డ్రెస్,లైట్ గ్రీన్,ఎల్లోకలర్ డ్రెస్ ఉందన్నారు.మృతురాలి తలకు గాయాలు ఉన్నట్లు తెలిపారు.మరణించిన మహిళామృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.మృతురాలి బంధువులు ఎవరైనా ఉంటే అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.ఈ కేసును అఫ్జల్‌గంజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

నిట్ నెం : 46/సర్కిల్-42/Engg/SBZ/GHMC/2026 తేది: 16.02.2026
పని పేరు: GHMC, సికింద్రాబాద్ జోన్, సర్కిల్-42 అంబర్‌పేటలో ఈతకొలను పని. మొత్తం టెండర్ సొమ్ము: రూ.10.00 లక్షలు. క్ర.సం.1. ప్రారంభ తేది: 17.02.2026 మ.3.00గం. నుండి. బిడ్ స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 20.02.2026 మ.3.00గం. వద్ద. శ్రీమతి. డి. ఆశాలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నం.42, అంబర్‌పేట, సికింద్రాబాద్ జోన్, GHMC. సెల్: 9963550657/6309920591. సంబంధిత EE చిరునామా: సర్కిల్-42, SBZ, GHMC, ఆర్‌డ్స్, GHMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-42, GHMC.
DIPR.NO. 15457-PP/CL/ADVT/1/2025-26 తేది: 17.02.2026

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్
బోడుప్పల్ సర్కిల్-10, ఉప్పల్ జోన్

నిట్ నెం : 03/EE/బోడుప్పల్ సర్కిల్ -10/MMC/టెండర్స్/2025-26 తేది: 17.02.2026.
పనిపేరు: 1) MMC, ఉప్పల్ జోన్, బోడుప్పల్ సర్కిల్-10లో వార్డ్ నం.11 బోడుప్పల్ యొక్క కాలనీ, ప్రవేశమును తిరుమల మెడికల్ వద్ద Opp వద్ద B/S ఇంటి నం: 8-7/A/1 నుండి Ext MH కు ప్రస్తుతం ఉన్న భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ యొక్క రీమోడలింగ్ పని. 2) అదే సర్కిల్-10 యొక్క వార్డ్ నం.11 బోడుప్పల్‌లో సాయి దుర్గా నగర్ కాలనీలో మరియు వివిధ లోకేషన్స్‌లో క్యాచ్ పిట్స్ యొక్క నిర్మాణం. 3) అదే సర్కిల్‌లో వార్డ్ నం. 11 & 12 లో జంక్షన్ల యొక్క ఇంటర్ కనెక్షన్లు. 4) అదే సర్కిల్‌లో వార్డ్ నం. 11 & 12 లో సీటీ సరఫరా నిర్వహణ. అంచనా మొత్తం : 23.00 లక్షలు. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం : 25.02.2026 సా.04.30గం. అధికారి పేరు మరియు చిరునామా: శ్రీ వి.హరిలాల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బోడుప్పల్ సర్కిల్-10, MMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.Tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బోడుప్పల్ సర్కిల్-10, MMC.
DIPR.NO.15413-PP/CL/ADVT/1/2025-26 తేది: 17.02.2026

**IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT: HYDERABAD**
**O.S. No. 383 of 2026**
**BETWEEN:**
Dhara Lalitha & Others .... **Plaintiffs**
**AND**
1) All Concerned
2) Tahsildar
Amberpet Mandal,
Hyderabad, T.S. .... **Defendants**
**To,**
**All Concerned,**
Sir,
Please take notice that the above named plaintiffs have filed the above suit for Declaration to declare them as legal Heirs of deceased Late Sri Dhara Satyanarayana Murthy.
The person/s who are interested in the above matter hereby summoned to appear before the Hon'ble Court in person or by a pleader duly instructed and able to answer all the material questions on 10-03-2026 at 10:30 am to answer, support or object the claim of the Plaintiffs.
Take notice that in default of your appearance the suit will be heard and determined in your absence.
**(BY ORDER OF THE COURT)**
M/s **PRATIK KUMAR AGARWAL** & ASSOCIATES, ADVOCATES
5-9-22/1/16, Adarsh Nagar, Basheerbagh, Hyderabad, T.S.

**IN THE COURT OF THE HON'BLE V SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT HYDERABAD.**
**E.P.No. 495 OF 2019**
**IN**
**O.S.No. 2400 OF 2005**
**Between:-**
M/s Margadarsi Chit Fund Pvt.Ltd., Secunderabad Branch. ....**Decree Holder**
**and**
Mr.Mohd Mujeebuddin & Others., ...**Judgment Debtors**
To
Mr.Mohd Mujeebuddin, S/o. Khaja Mumtazuddin Ahmed, R/o. H.No.9-4-87/C/4, Tolichowki, Hyderabad. ...**J.D.No.01**
Mr. Sd. Yousuf MD Mohdul Hussaini, S/o. SD.Nadeemullah Hussaini, R/o. H.No. 16-11-16/G/C/41, Afzal Nagar, Malakpet, Hyderabad. ...**J.D.No.02**
Mr. Omer Farooq, S/o. Abdul Razzak R/o. H.No.9-1-25/2, Hashim Nagar, Langer House, Hyderabad. ...**J.D.No.03**
Mr.D.Shekar, S/o. D.Damodar Rao, R/o. H.No.15-3-369, Gowliguda, Osman Shahi Chaman, Hyderabad. ...**J.D.No.04**
Please take Sale Notice that the above EP is filed against you for recovery of Rs. 3,30,896/- (Rupees Three Lakhs Thirty Thousand Eight Hundred Ninety Six Only) and the same is posted to 27.02.2026 for your appearance in the court at 10.30 A.M. If you fail to attend the court on that day the matter will be heard and decided exparty.
**// BY ORDER OF THE COURT //**
**R.CHAKRADHAR,**
ADVOCATE FOR DECREE HOLDER
H.No.6-1-295/1, PADMARAO NAGAR, HYDERABAD.

**IN THE COURT OF HON'BLE PRL.JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT : AT MEDIPALLY**
**O.S. No.28 of 2026**
**Between:**
Smt. GattuSujatha and others ...**Plaintiffs**
**AND**
The Tahasildar, GhatkesarMdl. and all concerned ..**Defendants**
To,
All Concerned
Please take notice that, the Plaintiffshave filed the above SUIT for declare them as legal heirs of late GattuYadaiah @G Yadaiah S/o. GattuLaxmaiah @ G Lakshmaiahwho died on 10-12-2007in respect of suit schedule property and the same has been posted on 02-03-2026. If any person(s) having any objection or claims, they may appear on 02-03-2026at10:30AM before the Hon'ble Court, either in person or through advocate, otherwise the matter will be decided basing the documents available on record. **SCHEDULE PROPERTY**:All that part and parcel of Domestic land of Plot bearing No. 141 in Survey No. 114, 118, 120 & 121, admeasuring 200 Sq.Yds equivalent to 167.2 Sq.Mtrs, situated at Kranthi Colony, Chengicherla Village and Grampanchayat, Ghatkesar Mandal, Medchal-Malkajgiri District (erstwhile Ranga Reddy District) and bounded by :**North** : 25' wide Road. **South** : Plot No. 150. **East** : Plot No. 140. **West** : Plot No. 142.
**\\ By order of the court **
**NALLAGATI RAMBABU**
**Advocates**
H No. 7-4-9/23/24, Yashodaranagar, Sagar Ring Road, Hyderabad - 500074
**Cell : 9949258012**

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM JFCM MAHBOOB NAGAR DISTRICT AT: JADCHERLA**
**I.A No. 207 of 2023**
**in**
**OS. No 277 of 2022**
**Between:**
R. Anil Kumar ...**Petitioner/Plaintiff**
**And**
Mohd. Ameeruddin and others ...**Respondents/Defendants**
NOTICE
To,
1) Smt. SINGAREDDY SUDEEPTHI W/O S. SURYANARAYANA REDDY Aged about: 28 Yrs Occ: Housewife R/o H.No 5-5-206/103, Plot No. 412, Prashanth Nagar, Vanasthalipuram, Hyderabad (Respondent No. 4)
**NOTICE**
Please take Notice that, the Plaintiff named above has filed the above suit for Declaration & Possession against you. The Summons sent to you were returned unserved. The above matter is posted on 27-02-2026 before the Hon'ble court at 10.30 AM for your appearance.
Therefore, you are hereby informed to appear before the Hon'ble court on the above-mentioned date & time either in person or through an advocate, failing which the matter will be heard and decided in your absence.
**"By order of the court"**
M/s **TEKULA MAHESHWAR RAO**
ADVOCATES
# Flat No. 102, Alekhya Residency, H. No. 10-4-35/3, Humayun Nagar, Hyderabad-500028, Telangana
**Mob: 9246288929**
**COUNSEL FOR THE PLAINTIFF**

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM JFCM MAHBOOB NAGAR DISTRICT AT: JADCHERLA**
**I.A No. 208 of 2023**
**in**
**OS. No 278 of 2022**
Between:
R. Anil Kumar ...**Petitioner/Plaintiff**
**And**
Mohd. Ameeruddin and others .... **Respondents/Defendants**
**NOTICE**
**To,**
1) Smt. SINGAREDDY SUDEEPTHI W/O S. SURYANARAYANA REDDY Aged about: 28 Yrs Occ: Housewife R/o H.No 5-5-206/103, Plot No. 412, Prashanth Nagar, Vanasthalipuram, Hyderabad (Respondent No. 4)
NOTICE
Please take Notice that, the Plaintiff named above has filed the above suit for Declaration & Possession against you. The Summons sent to you were returned unserved. The above matter is posted on 27-02-2026 before the Hon'ble court at 10.30 AM for your appearance.
Therefore, you are hereby informed to appear before the Hon'ble court on the above-mentioned date & time either in person or through an advocate, failing which the matter will be heard and decided in your absence.
**"By order of the court"**
M/s **TEKULA MAHESHWAR RAO**
ADVOCATES
# Flat No. 102, Alekhya Residency, H. No. 10-4-35/3, Humayun Nagar, Hyderabad-500028, Telangana
**Mob: 9246288929**
**COUNSEL FOR THE PLAINTIFF**

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM JFCM MAHBOOB NAGAR DISTRICT AT: JADCHERLA**
**I.A No. 209 of 2023**
**in**
**OS. No 279 of 2022**
**Between:**
R. Anil Kumar ...**Petitioner/Plaintiff**
**And**
Mohd. Ameeruddin and others ...**Respondents/Defendants**
**NOTICE**
**To,**
1) Smt. SINGAREDDY SUDEEPTHI W/O S. SURYANARAYANA REDDY Aged about: 28 Yrs Occ: Housewife R/o H.No 5-5-206/103, Plot No. 412, Prashanth Nagar, Vanasthalipuram, Hyderabad (Respondent No. 4)
**NOTICE**
Please take Notice that, the Plaintiff named above has filed the above suit for Declaration & Possession against you. The Summons sent to you were returned unserved. The above matter is posted on 27-02-2026 before the Hon'ble court at 10.30 AM for your appearance.
Therefore, you are hereby informed to appear before the Hon'ble court on the above-mentioned date & time either in person or through an advocate, failing which the matter will be heard and decided in your absence.
**"By order of the court"**
M/s **TEKULA MAHESHWAR RAO**
ADVOCATES
# Flat No. 102, Alekhya Residency, H. No. 10-4-35/3, Humayun Nagar, Hyderabad-500028, Telangana
**Mob: 9246288929**
**COUNSEL FOR THE PLAINTIFF**

**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: SECUNDERABAD**
**O.S.No. 37 of 2025**
**Between:**
Vendekode Sharampally Linga Reddy & Others ...**Plaintiffs**
**And**
1) The Tahsildar, Trimulgherry Mandal, Sec'bad
2) All Concerned ...**Defendants**
To
All Concerned (Defendant No.2)
Please take notice that the Plaintiffs herein filed the above suit against the Defendants herein for Declaration to declare the Plaintiffs as the legal heirs of the deceased Smt.Sharampally Prameela who died on 16-09-2025 and the said suit is posted to 02-03-2026 for your appearance. If you fail to appear before the above said Court on 02-03-2026 at 10-30 A.M. the case will be decided in your absence.
**//By the Order of the Court//**
**L.SRINIVAS PATEL**
**(TS-1077/1994)**
**Advocate**
Office at H.No.8-1-100/111, Shivajinagar
Secunderabad-500 003 (T.S.)
EMID: patelsrinivas465@gmail.com
**Mobile No.9866648637**

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM JFCM MAHBOOB NAGAR DISTRICT AT: JADCHERLA**
**I.A No. 213 of 2023**
**in**
**OS. No 283 of 2022**
Between:
R. Anil Kumar ...**Petitioner/Plaintiff**
And
Mohd. Ameeruddin and others ...**Respondents/Defendants**
**NOTICE**
**To,**
1) Smt. SINGAREDDY SUDEEPTHI W/O S. SURYANARAYANA REDDY Aged about: 28 Yrs Occ: Housewife R/o H.No 5-5-206/103, Plot No. 412, Prashanth Nagar, Vanasthalipuram, Hyderabad (Respondent No. 4)
**NOTICE**
Please take Notice that, the Plaintiff named above has filed the above suit for Declaration & Possession against you. The Summons sent to you were returned unserved. The above matter is posted on 27-02-2026 before the Hon'ble court at 10.30
AM for your appearance. Therefore, you are hereby informed to appear before the Hon'ble court on the above-mentioned date & time either in person or through an advocate, failing which the
matter will be heard and decided in your absence.
**"By order of the court"**
M/s **TEKULA MAHESHWAR RAO**
ADVOCATES
# Flat No. 102, Alekhya Residency, H. No. 10-4-35/3, Humayun Nagar, Hyderabad-500028, Telangana
**Mob: 9246288929**
**COUNSEL FOR THE PLAINTIFF**

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM JFCM MAHBOOB NAGAR DISTRICT AT: JADCHERLA**
**I.A No. 211 of 2023**
**in**
**OS. No 281 of 2022**
**Between:**
R. Anil Kumar ...**Petitioner/Plaintiff**
**And**
Mohd. Ameeruddin and others ...**Respondents/Defendants**
**NOTICE**
To,
1) Smt. SINGAREDDY SUDEEPTHI W/O S. SURYANARAYANA REDDY Aged about: 28 Yrs Occ: Housewife R/o H.No 5-5-206/103, Plot No. 412, Prashanth Nagar, Vanasthalipuram, Hyderabad (Respondent No. 4)
**NOTICE**
Please take Notice that, the Plaintiff named above has filed the above suit for Declaration & Possession against you. The Summons sent to you were returned unserved. The above matter is posted on 27-02-2026 before the Hon'ble court at 10.30 AM for your appearance.
Therefore, you are hereby informed to appear before the Hon'ble court on the above-mentioned date & time either in person or through an advocate, failing which the matter will be heard and decided in your absence.
**"By order of the court"**
M/s **TEKULA MAHESHWAR RAO**
ADVOCATES
# Flat No. 102, Alekhya Residency, H. No. 10-4-35/3, Humayun Nagar, Hyderabad-500028, Telangana
**Mob: 9246288929**
**COUNSEL FOR THE PLAINTIFF**

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM JFCM MAHBOOB NAGAR DISTRICT AT: JADCHERLA**
**I.A No. 212 of 2023**
**in**
**OS. No 282 of 2022**
**Between:**
R. Anil Kumar ...**Petitioner/Plaintiff**
**And**
Mohd. Ameeruddin and others .... **Respondents/Defendants**
**NOTICE**
**To,**
1) Smt. SINGAREDDY SUDEEPTHI W/O S. SURYANARAYANA REDDY Aged about: 28 Yrs Occ: Housewife R/o H.No 5-5-206/103, Plot No. 412, Prashanth Nagar, Vanasthalipuram, Hyderabad (Respondent No. 4)
**NOTICE**
Please take Notice that, the Plaintiff named above has filed the above suit for Declaration & Possession against you. The Summons sent to you were returned unserved. The above matter is posted on 27-02-2026 before the Hon'ble court at 10.30 AM for your appearance.
Therefore, you are hereby informed to appear before the Hon'ble court on the above-mentioned date & time either in person or through an advocate, failing which the matter will be heard and decided in your absence.
**"By order of the court"**
M/s **TEKULA MAHESHWAR RAO**
ADVOCATES
# Flat No. 102, Alekhya Residency, H. No. 10-4-35/3, Humayun Nagar, Hyderabad-500028, Telangana
**Mob: 9246288929**
**COUNSEL FOR THE PLAINTIFF**

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE CUM JFCM MAHBOOB NAGAR DISTRICT AT: JADCHERLA**
**I.A No. 210 of 2023**
**in**
**OS. No 280 of 2022**
**Between:**
R. Anil Kumar ...**Petitioner/Plaintiff**
**And**
Mohd. Ameeruddin and others ...**Respondents/Defendants**
**NOTICE**
**To,**
1) Smt. SINGAREDDY SUDEEPTHI W/O S. SURYANARAYANA REDDY Aged about: 28 Yrs Occ: Housewife R/o H.No 5-5-206/103, Plot No. 412, Prashanth Nagar, Vanasthalipuram, Hyderabad (Respondent No. 4)
**NOTICE**
Please take Notice that, the Plaintiff named above has filed the above suit for Declaration & Possession against you. The Summons sent to you were returned unserved. The above matter is posted on 27-02-2026 before the Hon'ble court at 10.30 AM for your appearance.
Therefore, you are hereby informed to appear before the Hon'ble court on the above-mentioned date & time either in person or through an advocate, failing which the matter will be heard and decided in your absence.
**"By order of the court"**
M/s **TEKULA MAHESHWAR RAO**
ADVOCATES
# Flat No. 102, Alekhya Residency, H. No. 10-4-35/3, Humayun Nagar, Hyderabad-500028, Telangana
**Mob: 9246288929**
**COUNSEL FOR THE PLAINTIFF**

## సిఎం సహాయనిధి పేదలకు మేలు
### : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్ ఓసి ని లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు

**మలక్ పేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు ఎంతో మేలు చేకూరుస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో తలకొండపల్లి మండలం గౌరిపల్లికి చెందిన సుజాతకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల ఎల్ఓసి పత్రాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడ పోచమ్మ ఆలయ అభివృద్ధిపై క్షేత్రస్థాయి పరిశీలన


అల్మాస్‌గూడో పోచమ్మ ఆలయ అభివృద్ధిపై క్షేత్ర పరిశీలన చేస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, కుంచె నాగేందర్‌గౌడ్, రామిడి బుచ్చిరెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్‌లోని అల్మాస్‌గూడ గ్రామ శివార్లలోనున్న ప్రధాన పోచమ్మ అమ్మవారి దేవాలయ అభివృద్ధిపై గ్రామస్తులు క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఛైర్మన్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు కుంచె నాగేందర్‌గౌడ్, రామిడి బుచ్చిరెడ్డి, రామిడి నర్సింహారెడ్డి, రామిడి సత్తిరెడ్డి, చప్పిడి జంగారెడ్డి, చప్పిడి నర్సింహారెడ్డిలతో పాటు పలువురు మంగళవారం బడంగ్‌పేట్ సర్కిల్ ఎఇఇ హరీష్‌తో కలిసి పరిశీలన చేశారు. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో మొత్తం సిసి చేయాలని నిర్ణయించారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ జోనల్ కమీషనర్ చంద్రకళ, డిప్యూటీ కమీషనర్ సరస్వతిలతో చర్చించి వారి సహకారంతో సిసి పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధిలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిల చొరవ, సహకారం ఉందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యాంజాల వెంకట్‌రెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి, సంరెడ్డి సుధాకర్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు


ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో మంచినీటి ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, పూడూరి జితేందర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పూడూరి జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో మంచినీటి ప్లాంటును మంగళవారం ఉప్లప్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డిలు ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు ఉప్పల్ బీఆర్ఎస్ సీనియర్ నేత పూడూరి జితేందర్‌రెడ్డి ముందుకు రావడం హర్షనీయమన్నారు. విద్యార్థుల కోసం 500 లీటర్ల సామర్థం కలిగిన ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించామని తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ జన్మదినం సందర్భంగా దీనిని అంకితం చేశామని తెలిపారు. విద్యార్థులు స్వచ్ఛమైన నీటిని తాగేందుకు స్వంత నిధులతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన పూడూరి జితేందర్‌రెడ్డిని అభినందించారు. ప్రజాసేవలో ప్రతి ఒక్కరు ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామరావు, ప్రిన్సిపల్ అశోక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.విజయ్‌కుమార్, పలువురునేతలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామి ఆలయ కమిటి ధర్మకర్త కృష్ణయ్యకు సత్కారం


మల్లికార్జునస్వామి ఆలయ కమిటి సభ్యునిగా ఎన్నికైన చిటికల కృష్ణయ్యను సత్కరిస్తున్న వంశరాజ్ సంక్షేమ సంఘం నేతలు

**రామంతాపూర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** రామంతపూర్‌లోని పురాతన శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం కమిటి ధర్మకర్తగా నియమితులైన చిటికల కృష్ణయ్యను మంగళవారం పలువురు వంశరాజ్ సంక్షేమ సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు రామంతాపూర్‌లోని వంశరాజ్ సంక్షేమ సంఘంలో జరిగిన సమావేశంలో పలువురు నేతలు పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిటికెల కృష్ణయ్య మాట్లాడుతూ శ్రీ మల్లికార్జున దేవస్థానం కమిటిలో ధర్మకర్తగా స్థానం లభించడం మన సంఘానికి ఎంతో గర్వకారణమన్నారు.ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని, తనకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కలిసికట్టుగా ఉండే ఎన్నో సాధించవచ్చని సూచించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ శాగ శ్రీధర్‌తోపాటు ధర్మకర్తలు కాసర్ల శేఖర్ రెడ్డి, సీమకండ్ల జంగయ్య, ముదికొండ అరుణ్ సాయి, లొడే శిరీష్ గౌడ్, మెంగ శోభ తదితరులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాసని బాలస్వామి వంశరాజ్, ప్రధాన కార్యదర్శి ఇగజీవ తిరుపతయ్య వంశరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాయసం గోపాల్ వంశరాజ్, ఉపాధ్యక్షులు చిన్న కృష్ణ వెంకటయ్య నరసింహ, చందు, బాలు, రాము, వీరస్వామి, బాలస్వామి, మల్లేష్,శివ పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అసెస్‌మెంట్ గుట్టురట్టైనా చర్యలు శూన్యం

**-పని పూర్తి చేసిన వారెవరో**
**-పోలీసు ఫిర్యాదు ఊసే లేదు**
**-పట్టించుకోని విజిలెన్స్ అధికారులు**

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** మూడు సర్కిల్ కార్యాలయాలు ఒకే భవనంలో ఉండడం వల్ల వారి పని సులభమైందా? ఇతర అధికారుల లాగిన్ నుంచి పని ఎలా పూర్తి చేయగలిగారు? ఓ సర్కిల్ పని మరో సర్కిల్ కార్యాలయం అధికారులు ఎందుకు చేసినట్టు? ఈ వ్యవహారంలో ఎంతమంది అధికారుల పాత్ర ఉంది? ఎన్ని లక్షల రూపాయలు చేతులు మారాయి? ఈ తప్పుడు వ్యవహారం బయటకు పొక్కి రెండు నెలలు పూర్తవుతున్న జిహెచ్ఎంసి అధికారులు, విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.తప్పుడు అసెస్ మెంట్ చేసిన వ్యవహారంలో అధికారులు చేసిన తప్పిదం బట్టబయలు అయినప్పటికీ జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు వారిని పట్టుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ సర్కిల్ కార్యాలయానికి సంబంధించిన అసెస్‌మెంట్ మరో సర్కిల్ కార్యాలయం అధికారులు నిర్భయంగా పని పూర్తి చేశారంటే వారి చాకచక్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. సర్కిల్ విభజన కాకముందు హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని మన్సూరబాద్‌కు చెందిన ఓ భవనానికి సరూర్‌నగర్ సర్కిల్ అధికారులు అసెస్‌మెంట్ చేశారు.


సర్కిల్ కార్యాలయం

మన్సూరబాద్‌లోని 3-8-439/1 ఇంటి నెంబర్‌కు గత సంవత్సరం పిటిఐఎన్ నెంబర్ 1050315474 కేటాయిస్తూ సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీకమిషనర్ బోనగిరి శ్రీనివాస్, ఏఎంసి శ్రీనివాసరావు లాగిన్ నుంచి అసెస్‌మెంట్ కేవలం ఒక గంట పరిధిలోనే పని పూర్తి చేసేశారు. మీ లాగిన్ నుంచి పని పూర్తయిందని డిప్యూటీకమిషనర్, ఏఎంసీలను ప్రశ్నిస్తే మాకు తెలియకుండానే పని జరిగిపోయింది అంటూ అమాయకంగా సమాధానం చెబుతున్నారు. ఈ వ్యవహారం గురించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గత రెండు నెలలుగా దాటివేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ అనుమతి తీసుకున్న తర్వాత పోలీస్ కేసు పెడతామని రెండు నెలలుగా వారిద్దరు నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. తప్పు చేయనట్లయితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి అసలు దింగలను ఎందుకు పట్టించడం లేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నచిన్న పనుల కోసం సర్కిల్ కార్యాలయానికి వచ్చేవారిని చెప్పులు అరిగేలా తెప్పించుకునే అధికారులు ఎటువంటి సంబంధం లేని మరో సర్కిల్ కార్యాలయం పనిని మాత్రం కేవలం ఒక గంటలో పూర్తి చేశారంటే ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారం బట్టబయలైనప్పటికీ ఉన్నతాధికారులు కూడా ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నూతనంగా ఏర్పాటైన మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి మారిన ఈ సర్కిళ్ల వ్యవహారంపై నూతన కమిషనర్ దృష్టి సారించి అవినీతికి పాల్పడ్డ అధికారుల ఆట కట్టించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటువంటి పనులు భవిష్యత్తులో జరగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఉప్పల్ కాలభైరవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లోని శ్రీ కాలభైరవస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీ కాలభైరవస్వామి ఆశీస్సులతో ఉప్పల్ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయంలో భక్తులకు వివిధ సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## నాదర్‌గుల్ డివిజన్‌లోని పాత గ్రామాలు, కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి : నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ కిందకు వచ్చే నాదర్‌గుల్ డివిజన్-57లోని పాత గ్రామాలు, కాలనీల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటున్నామనీ పార్టీ తరపున వాటిని తీర్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, డివిజన్ నేత నవారు మల్లారెడ్డి స్పష్టం చేశారు. డివిజన్‌లోని అల్మాస్‌గూడ ఎంఆర్ఆర్ కాలనీలో రూ.10 లక్షల ప్రత్యేక నిధులతో జరుగుతున్న సిసి రోడ్డు పనులను మంగళవారం ఆయన స్థానిక కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి అక్కడి కాంట్రాక్టర్‌తో ప్రజాధనం వృధాకాకుండా రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలనీ తద్వారా రహదారులు కొన్నేళ్ళపాటు మన్నేటట్లు చేయాలని సూచించారు. గత బిఆర్ఎస్ పాలనలో ఎవరూ పట్టించుకోకపోవడంతో రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను గుర్తించి అవసరమైన చోట్ల దశల వారీగా అభివృద్ధి పనులు చేయిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జిల్లా ఇంఛార్జి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కెఎల్ఆర్‌ల దృష్టికి సమస్యలను తెచ్చి ప్రత్యేక నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేయిస్తున్నామని ఆయన వివరించారు. ఈ మేరకు శ్రీధర్‌బాబు, కెఎల్ఆర్‌తో పాటు అభివృద్ధికి


ఎంఆర్ఆర్ కాలనీలో ప్రారంభమైన సిసి రోడ్డు నిర్మాణపు పనులను పరిశీలిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి

సహకరిస్తున్న మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ కమీషనర్ పి.సరస్వతిలకు మల్లారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు డివిజన్‌లోని పాత గ్రామాల్లో, కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పనులు చేయిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు సుధాకర్‌రెడ్డి, రాజేష్, మహేందర్ నాయక్, వెంకట రమణ, శంకర్ నాయక్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆనాథ విద్యార్థి చదువుకు చేయూత

**మన్సూరాబాద్, ఫిబ్రవరి 17 , ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ లోని ప్రగతి నగర్ కాలనీలో డివిజన్ పార్టీ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు మరియు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని రఘువీర్ ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వంలో ఎంతో మందికి ఉపయోగపడిన కంటి వెలుగు కార్యక్రమం నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తిగా నిర్వీర్యమైందని, అలాంటి గొప్ప కార్యక్రమాన్ని కేసీఆర్ జన్మదినం సందర్భంగా తమ ట్రస్ట్ ద్వారా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమాన్ని మన్సూరాబాద్ డివిజన్, లెక్చరర్స్ కాలనీ డివిజన్ మరియు జి ఎస్ ఐ డివిజన్‌లలో మొత్తం 6000 మంది ప్రజలకు (ప్రతి డివిజన్‌కు 2000 మంది చొప్పున) నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే కేక్ కట్ చేసి, సంబరాలు నిర్వహించి, కార్యక్రమానికి విచ్చేసిన నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.అదే విధంగా అనాథ విద్యార్థి గృహం లో వైద్య విద్యను అభ్యసిస్తున్న ఒక అనాథ విద్యార్థికి మొత్తం రూ. 2,40,000/ ఫీజును భరిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మూడవ


వైద్య విద్యార్థికి చెక్ అందజేస్తున్న జక్కిడి

సంవత్సర ఫీజుగా రూ. 40,000/ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, అధ్యక్షులు జక్కిడి మల్లా రెడ్డి, మాజీ అధ్యక్షులు పోచబోయిన జగదీశ్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి వెంకన్న, ఆదర్శ సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేషన్ కార్యవర్గం, పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, యువత మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లెలగూడ సాయినగర్ స్మశానవాటిక అభివృద్ధిపై పాలకులు, అధికారుల వివక్ష : బిజెపి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కిందకు వచ్చిన మీర్‌పేట్ డివిజన్-60లోని జిల్లెలగూడ సాయినగర్ స్మశానవాటికలో కనీస సదుపాయాలను కల్పించాలని మీర్‌పేట్ పాత కార్పొరేషన్ బిజెపి-2 అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శి సిద్దాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు గాజుల మధు, బచ్చనమోని కాశీరాం యాదవ్, వలభోజు గోపినాథ్ తదితరులతో కలిసి సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్న స్మశానవాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి స్మశానవాటిక అభివృద్ధిని పాలకులు, అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుట్టెడు దుఃఖంతో ఇక్కడికి అంత్యక్రియల కోసం వచ్చే ప్రజలకు కనీస సదుపాయాలు లేవని ఆయన అన్నారు. మహిళలకు స్నానాల గదులు లేవనీ నీటి సదుపాయం కూడా కరువైందనీ దీంతో ట్యాంకర్ల ద్వారా నీళ్ల తెప్పించుకొని వాడుకోవాల్సిన దుస్థితి కలుగుతోందని ఆయన మండిపడ్డారు. సాయినగర్ స్మశానవాటిక అభివృద్ధిపై వివక్ష చూపుతున్నారని ఆయన ఆరోపించారు.


జిల్లెలగూడ సాయినగర్ స్మశానవాటిక సమస్యలను పరిశీలిస్తున్న బిజెపి నేతలు తులసి ముఖేష్ ముదిరాజ్, సిద్దాల శ్రీనివాస్, గాజుల మధు తదితరులు

ఇప్పటికైనా జోనల్ కమీషనర్, డిప్యూటీ కమీషనర్‌లు స్పందించి స్మశానవాటికలో ప్రజలకు సౌకర్యాలు కల్పించే విధంగా పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ తరపున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని ముఖేష్ ముదిరాజ్ హెచ్చరించారు. ఈ కార్యరకమంలో మల్లికార్జున్, శశి తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ కింద పడి ఐటిఐ విద్యార్థి దుర్మరణం


ప్రమాద స్థలిలో విద్యార్థి మృతదేహం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ప్యాసింజర్ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా రోడ్డుపైకి రావడం.. దానిని ఓవర్‌టేక్ చేస్తే ప్రయత్నంలో మోటార్ సైకిల్ నడుపుతున్న ఓ ఐటిఐ విద్యార్థి టిప్పర్ టైర్ కింద పడి దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన మంగళవారం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ దుర్ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. వైజాగ్ ప్రాంతానికి చెందిన తండ్రి లేని గొర్రెపోతు వర్ధన్ (19) అనే యువకుడు నాదర్‌గుల్‌లో ఉంటూ బాలాపూర్ చౌరస్తాలోని ఐటిఐ కాలేజీలో చదువుకుంటున్నాడు. అయితే మంగళవారం నాదర్‌గుల్ నుండి మోటార్ సైకిల్‌పై కాలేజీకి వెళ్తుండగా మార్గమధ్యంలో బడంగ్‌పేట్ ఎస్‌బిఐ బ్యాంకు ప్రాంతంలో రోడ్డుపైకి ఒక్కసారిగా ఆటో రావడంతో వెనుక వస్తున్న వర్ధన్ దానిని తప్పించి ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో పక్క నుండి వెళ్తున్న టిప్పర్ (నెం. ఎపి టిటి 4717) ముందు టైర్ కింద పడ్డాడు. దీంతో గమనించకుండా డ్రైవర్ ముందుకు పోవడంతో వర్ధన్‌ను కొంత దూరం వరకు టిప్పర్ ఈడ్చుకెళ్ళింది. ఈ నేపథ్యంలో తీవ్ర గాయాల పాలైన విద్యార్థి సంఘటనా ప్రాంతంలోనే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ టిప్పర్‌ను వదిలి పారిపోయాడు. సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు ఘటనా స్థలికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును నమోదు చేసుకొని ఇన్స్‌పెక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

## బాబా ఫరీదుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలు



**అత్తాపూర్ ఫిబ్రవరి17,ప్రభాతవార్త :** కులమతాలకతీతంగా పండుగలను జరుపుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గగన్ పహాడ్‌లోని దర్గా బాబా ఫరీదుద్దీన్ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని స్థానిక నాయకుడు సరికొండ వెంకటేష్‌తో కలిసి దర్గాను సందర్శించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత సామరస్యానికి దర్గా ఉత్సవాలు ప్రతీకలని, నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని బాబా వారిని కోరుకున్నట్లు తెలిపారు.అనంతరం దర్గా కమిటీ సభ్యులు మరియు స్థానిక నాయకులు ఎమ్మెల్యేని సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సరికొండ వెంకటేష్, రాజు, సన్నావుల వికలాంగుల సమస్య అధ్యక్షులు మహబూబ్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు బహుమతులు ప్రధానం

క్రీడలు విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘ(ట్రెస్మా), రాజేంద్రనగర్ మరియు రంగారెడ్డి జిల్లా విభాగం ఆధ్వర్యంలో వార్షిక క్రీడల బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు.కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రెస్మా సంఘం ప్రతినిధులు, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా చంపాపేటలో అన్నదానం

**సైదాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పదని శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటి ఛైర్మన్ దండేటికార్ భగవత్ జి(భగవాన్) అన్నారు. అమావాస్య సందర్భంగా మంగళవారం శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటి ఆధ్వర్యంలో చంపాపేటలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటి ఛైర్మన్ భగవాన్ మాట్లాడుతూ గత 34 మాసాలుగా ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్ బిఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, కమిటి సభ్యులు సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, చింటు, ఆడెల్ల రాజు, టింగ్లికార్ రాజేష్, తిలక్ రాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న కమిటి ఛైర్మన్ భగవాన్, రవి ముదిరాజ్

## శ్రీనివాసపురంలో డిప్యూటి కమిషనర్ రాజు పర్యటన

**రామంతాపూర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :** రామంతాపూర్ శ్రీనివాసపురంలో మంగళవారం డిప్యూటి కమిషనర్ గోదుమల రాజు పలువురు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి అభివృద్ధి పనులు పరిశీలించారు. శ్రీనివాసపురంలో చేపట్టిన డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, పనులు నాణ్యత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక నుంచి ప్రతి రోజు అన్ని డివిజన్‌లలో అకస్మికంగా పర్యటిస్తానని తెలిపారు. పనులు సక్రమంగా చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ శ్వేతశ్రీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


రామంతాపూర్ శ్రీనివాసపురంలో డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ జి.రాజు, డిఇ వెన్నెలగౌడ్ తదితరులు

## రాహుల్‌గౌడ్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న లింగాల రాహుల్‌గౌడ్, విజయగౌడ్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్‌లో కొత్తపేట డివిజ న్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర చరిత్రాత్మ కమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కెసిఆర్ చేసిన కృషి ఎల్లప్పుడూ మార్గదర్శకమని కొనియాడారు. డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం, కేక్ కటింగ్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అదేవిధంగా పేదవారికి అన్నదానం, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి, రోగులకు పండ్లు కార్యక్రమాలను చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయగౌడ్, తోట శ్రీనివాస్‌యాదవ్, శ్రీశైలంగౌడ్, రూప, పద్మ, శశిధర్‌పటేల్, తాళ్ల శీను, రాజు, రామకృష్ణ, అనిల్, చిరు, గోపాల్‌యాదవ్, సాగర్‌గౌడ్, శశి, రమేష్, అమిత్, సచిన్, మోహిత్, శీనన్న, సైదులు, విక్రమ్‌గౌడ్, మహమూద్, శీను, సుధాకర్, రమేష్‌గుప్తా పాల్గొన్నారు.

## జెఈఈ మెయిన్స్‌లో 99.72 పర్సెంటైల్ సాధించిన దర్పల్లి త్రిషాంక్

**సైదాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కుమారుడు దర్పల్లి త్రిషాంక్ జెఈఈ మెయిన్స్‌లో 99.72 పర్సంటైల్ సాధించారు. జెఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన త్రిషాంక్‌కు పలువురు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

## బస్తీదవాఖానాకు కుర్చీల బహుకరణ

**సైదాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినం సందర్భంగా చంపాపేటలో తెలంగాణ ఉద్యమకారులు రామ్‌లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం బస్తీదవాఖానాకు వచ్చే రోగులు కూర్చోవడానికి కుర్చీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, వంశీధర్‌రెడ్డి, హబీబ్, దర్వేజ్‌ఖాన్, ఖాదర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమం కోసం కృషి : మాజీ మంత్రి మహముద్ ఆలీ

**మలక్ పేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని మాజీ మంత్రి మహముద్ అలీ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని అజంపుర లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజం ఆలీ, తీగల ఆజీత్ రెడ్డి, తేల్ల మహేశ్ కుమార్, అనితా నాయక్, రాధ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిని ఖాళీ చేయాలని మహిళపై కత్తితో దాడికి పాల్పడిన మరిది

**మలక్ పేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ఇంటిని ఖాళీ చేయాలని మహిళపై కత్తితో మరిది దాడికి పాల్పడిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మలక్‌పేట పల్టాన్ లో వల్లభోజు సరిత తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తుంది. ఆమె భర్త వి. వెంకటేశ్వరరావు మే 2023 లో మరణించారు. ఆమె ప్రైవేట్ టీచర్ గా పనిచేస్తుంది. ఆమె భర్త చనిపోయిన తరువాత నుంచి మరిది గోవిందరాజు తదితరులు సరిత ను వేధింపులకు గురిచేస్తూ వెంటనే ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారు. కాగా మంగళవారం ఉదయం సరిత తన పోర్షన్ వద్ద శుభ్రం చేసుకుంటుండగా ఒక్కసారిగా గోవిందరాజు వచ్చి కత్తితో సరిత పై దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. అదే విధంగా సరితను డ్రంలో ముంచడానికి ప్రయత్నించడంతో ఆమె కుమార్తె వచ్చి అడ్డుకోవడంతో ఆమెపై కూడా దాడి చేయడం జరిగింది. దీంతో బాధితురాలు సరిత చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.